మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 82 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad




## ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- లోయలోపడ్డ వాహనం.. - 8మంది మృత్యువాత



నైనిటాల్ (ప్రజా మంటలు): ఉత్తరాఖండ్ లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రుద్రప్రయోగ్ లోని బ్రదీనాథ్ హైవే సమీపంలో అదుపుతప్పి టెంపో వాహనం లోతైన లోయలో పడింది. ఈ ఘటనలో 8 మంది మృతి చెందారు. మరి కొందరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో టెంపోలో 17 మంది ప్రయాణిస్తున్నారు. ఘటనా స్థలానికి వచ్చిన ఔఆఖీఈ, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. లోయలో నుంచి ఇద్దరిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడ్డ వీరిని హాస్పిటల్ కు తరలించారు. మరోవైపు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్స సింగ్ ధామి స్పందించారు. ఔఆఖీఈ, పోలీసులు సహాయక చర్యలు చేస్తున్నారని ట్వీట్ చేశారు. ప్రమాదంపై విచారణ చేయాలని జిల్లా మేజిస్ట్రేట్ ను ఆదేశించారు.

# అంతా కేసీఆరే చెప్పినట్టే చేశాం..

- మేడిగడ్డ వద్ద బ్యారేజ్‌ను ఆయన సూచించారు
- మాకేం సంబంధం లేదు
- మేం తమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్‌ను సూచించాం
- కానీ అప్పటి ప్రభుత్వం మా ప్రతిపాదన పట్టించుకోలేదు
- జస్టిస్ ఘోష్ ముందు రిటైర్డ్ ఇంజనీర్ల వాదన
- కాళేశ్వరంపై విచారణ వేగవంతం చేసిన కమిషన్



హైదరాబాద్,జూన్15 (ప్రజా మంటలు): కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో నాటి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కర్త, కర్మ, క్రియ అని రిటైర్డ్ ఇంజనీర్లు తెలిపారు. మేడిగడ్డ వద్ద బ్యారేజ్‌ను కేసీఆర్ సూచించారని.. తమ్మిడిహట్టి వద్ద ప్రపోజ్ చేసినా దాన్ని పక్కకు పడేశారని ఇంజనీర్లు వాపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 2015లో వేసిన అనంతరాములు కమిటీలోని రిటైర్డ్ ఇంజనీర్లతో జస్టిస్ పినాకి చంద్రఘోష్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఇంజనీర్లు కాళేశ్వరం ప్రాజెక్ట్ గురించి కీలకమైన సమాచారాన్ని అందించారు. మిగతా 2లో..

# 531 ప్రభుత్వ వైద్యుల పోస్టులు

- భారీగా డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది నియామకానికి సర్కారు నిర్ణయం
- మొత్తం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో మొత్తం 755 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్
- 531 సివిల్ అసిస్టెంట్ సర్జన్, 193 ల్యాబ్ టెక్నీషియన్, 31 స్టాఫ్ నర్సుల పోస్టులకు పచ్చజెండా

హైదరాబాద్,జూన్15 (ప్రజా మంటలు): రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో 755 ఉద్యోగాల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 531 సివిల్ సర్జన్ పోస్టులు భర్తీ చేయనున్నారు. వివిధ ఆస్పత్రుల్లో 31 స్టాఫ్ నర్సులు, వ్యాధి నిర్ధారణ కోసం 193 ల్యాబ్ టెక్నీషియల్ పోస్టుల భర్తీ కోసం త్వరలో నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర వైద్యారోగ్య సేవల నియామక బోర్డు ద్వారా ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఓ వైపు వర్షాకాలం సీజనల్ జ్వరాలు ప్రబలుతుండటం, మరోవైపు పీహెచ్?సీ వైద్యులు, సిబ్బంది కొరత ఉన్నందన వైద్యారోగ్య శాఖలో ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు ద్వారా ఈ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయనుంది ప్రజారోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఆసుపత్రులు, విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీపై దృష్టిసారించింది. నియామకాల అనంతరం ఆయా పీహెచ్‌సీల్లోని డిమాండ్‌కు అనుగుణంగా సర్జన్లను నియమించనున్నారు.

### త్వరలో ఏపీలోనూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

- ఏపీ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కడప (ప్రజా మంటలు): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని త్వరలోనే అమలు చేస్తామని ఏపీ రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలో ఇప్పటికే ఉచిత ప్రయాణం అమలవుతున్నందున..మరింత లోతుగా అధ్యయనం చేసి పొరపాట్లకు తావు లేకుండా రాష్ట్రంలో ప్రవేశపెడతామన్నారు. రవాణాశాఖ మంత్రిగా నియమితులైన తర్వాత తొలిసారి కడప విచ్చేసిన రాంప్రసాద్‌రెడ్డికి తెదేపా శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. గడిచిన ఐదేళ్లలో జగన్ ముఠా దోపిడీ చేసిన ప్రజాధనాన్ని వడ్డీతో సహా కక్కిస్తామన్నారు.

## ఎన్డీయే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు

- కానీ మేం అలా జరగాలని కోరుకోవట్లేదు - దేశానికి మంచి జరగాలి
- దాని కోసం కలిసికట్టుగా పనిచేయాలనే ఆశిస్తున్నాం
- కానీ ప్రధానికి మాత్రం మంచిని కొనసాగించే అలవాటు లేదు - ఖర్గే కీలక వ్యాఖ్యలు



బెంగళూరు (ప్రజా మంటలు): కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు.మోదీ సర్కారు పొరపాటుగా ఏర్పాటైందని, ఏ క్షణమైనా కూలిపోతుందని జోస్యం చెప్పారు. మోదీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి పూర్తి సంఖ్యాబలం లేదు. ఇది మైనార్టీ ప్రభుత్వం. ఎన్డీయే సర్కారు ఎప్పుడైనా మిగతా 2లో..

# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

హైదరాబాద్, జూన్15 (ప్రజా మంటలు): తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ జరిగింది. 20 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్దిరోజులకు తాత్కాలిక బదిలీలు జరిపింది. గత ప్రభుత్వ హయాంలో పలు స్థానాల్లో ఉన్నవారిని మార్చింది. అనంతరం లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో బదిలీలు నిలిచిపోయాయి. ఎన్నికలు ముగియడంతో మిగతా 2లో..

# త్వరలో బీజేపీలో బీఆర్ఎస్ విలీనం

- పురోగతిలో చర్చలు ..త్వరలోనే ప్రక్రియ పూర్తి
- మంత్రి కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు

సూర్యాపేట (ప్రజా మంటలు): బీజేపీలో బీఆర్ఎస్ పార్టీని విలీనం చేసేందుకు చర్చలు జరుగుతున్నాయని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరోలనే బిజెపిలో బిఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని అన్నారు. శనివారం నూతనకల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కేసీఆర్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. సంతోష్ రావు, వినోద్ కుమార్, నమస్తే తెలంగాణ ఎండీ దామోదర్, కేటీఆర్ లు కలిసి.. బీఆర్ఎస్ పార్టీని విలీనం చేయడానికి బీజేపీ అధిష్టానంతో చర్చలు జరుపుతున్నారని అన్నారు. ఎల్ నర్సింహారెడ్డి విచారణ కమిటీని కేసీఆర్ రద్దు చేయడం అనడం విడ్డూరమన్నారు. యాదాద్రి, ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోళ్లలో కేసీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. త్వరలో ఆధారాలతో సహా నిరూపిస్తామని ఆయన చెప్పారు. కేసీఆర్ హయాంలో గొర్రెల స్కామ్ లో కూడా రూ.7 వందల కోట్ల స్కాం జరిగిందన్నారాయన. దీనిపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ విచారణ చేపట్టిందని తెలిపారు. ఢిల్లీలో రూ.11 వందల కోట్ల లిక్కర్ స్కామ్ చేసి.. కవిత జైల్లో ఊచల లెక్కబెడుతోందన్నారు. ఫోన్ ట్యాపింగ్ లో ప్రభాకర్ రావుతో సహా అందరూ జైలుకు వెళ్తారని మంత్రి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేస్తే ఏడేళ్ల వరకు బెయిలు రాదన్నారు. అందుకే అమెరికా నుంచి ప్రభాకర్ రావును రానివ్వడం లేదని అన్నారు. రాష్ట్రంలో పదేళ్లు కేసీఆర్.. ప్రజలను మోసం చేసి లక్షల కోట్ల రూపాయలను దోచుకున్నారని మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు.

# రూ.30 లక్షలకు నీట్ పేపర్

- ఒక్కో అభ్యర్థి చెల్లించిన మొత్తమిది - దర్యాప్తులో నిగ్గుతేలుతున్న నిజాలు




పట్నా (ప్రజా మంటలు): దేశంలో వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్- యూజీ ప్రవేశ పరీక్ష 2024 లో అక్రమాలు జరిగినట్లు వస్తోన్న ఆరోపణలు తీవ్ర దుమారం రేపుతున్నాయి.బిహార్‌లో ఈ పరీక్ష ప్రశ్నపత్రం లీకైనట్లు సమాచారం రాగా.. కేంద్రం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ దీన్ని తోసిపుచ్చింది. అయితే, తాజాగా బిహార్ ఆర్థిక నేరాల విభాగం చేపట్టిన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నీట్ పేపర్ లీక్ చేసినందుకు కొందరు అభ్యర్థులు రూ.30 లక్షల చొప్పున చెల్లించినట్లు బయటపడిందట. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణలపై దర్యాప్తునకు బిహార్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటుచేసింది. ఇందులోభాగంగానే ఇప్పటివరకు 14 మందిని అరెస్టు చేశారు. వీరిలో బిహార్ ప్రభుత్వ విభాగంలో పనిచేసే ఓ జూనియర్ ఇంజినీర్ కూడా ఉన్నాడు. పేపర్ లీక్ గ్యాంగ్‌తో కలిసి తాను అక్రమాలకు పాల్పడినట్లు ఆ జూనియర్ ఇంజినీర్ విచారణలో అంగీకరించినట్లు సమాచారం. కొందరు నీట్ అభ్యర్థుల కుటుంబసభ్యులతోనూ తాను టచ్‌లో ఉన్నట్లు చెప్పాడట. "మే 4వ తేదీన ఆ గ్యాంగ్‌లోని మాకు నీట్ ప్రశ్నపత్రం లభించింది. ఈ పేపర్ కోసం కొంతమంది అభ్యర్థుల నుంచి మేం రూ.30లక్షల నుంచి రూ.32 లక్షల చొప్పున తీసుకున్నాం. ఆ తర్వాత వారిని సేఫ్‌హౌస్‌కు తీసుకెళ్లి ప్రశ్నపత్రం చూపించాం" అని మరో ఇద్దరు నిందితులు విచారణలో అంగీకరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం దీనిపై విచారణ కొనసాగుతోంది. మొత్తం 13 మంది నీట్ అభ్యర్థులు ఈ పేపర్ లీక్‌లో భాగస్వాములైనట్లు అధికారులు గుర్తించారు. ఇందులో నలుగురిని ఇప్పటికే అరెస్టు చేయగా.. మరో 9 మందికి తాజాగా నోటీసులు జారీ చేశారు. సోమ, మంగళవారాల్లో విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. కాగా.. ఈ తాజా ఆరోపణలపై జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ ఇంకా స్పందించలేదు.కాగా వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ 2024 ఎంట్రన్స్ టెస్ట్ రిజల్ట్స్ పై లీకేజీ ఆరోపణలు, అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. దీంతో పరీక్ష రాసి.. అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్ లో పాల్గొనాలో లేదోనన్న అయోమయంలో పడ్డారు. నీట్ కౌన్సెలింగ్ ను ఆపివేయాలని దాఖలైన పిటిషన్ పై ఇటీవలే సుప్రీంకోర్టు స్టే విధించింది. తాజాగా నీట్ 2024పై వస్తున్న ఆరోపణలపై మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందించారు. నీట్ 2024పై వస్తున్న ఆరోపణలన్నింటినీ ఆయన కొట్టిపారేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు.. అభ్యర్థులకు భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, విద్యార్థులు ఎలాంటి అనుమానాలు లేకుండా కౌన్సెలింగ్ లో పాల్గొనాలని కోరారు. నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానున్న క్రమంలో.. ఇలాంటి ఆరోపణలు చేసి.. వారి భవిష్యత్తుతో మిగతా 2లో..


### తక్కువ ధరలో నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయాలి

- పూలు పండ్ల మొక్కల పెంపకంతో ఆదాయం
- సౌరవిద్యుత్ యూనిట్ల ఏర్పాటుపైనా ఆరా
- అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల

2లో..



## ప్రజా నాడి




## ఈ కమిషన్ రాజకీయ కక్ష సాధింపు కోసమే

- మీ ముందుకొచ్చి నేనేం చెప్పినా ప్రయోజనం ఉండదు
- చట్టబద్ధంగానే విద్యుత్ కొనుగోళ్లు చేశాం
- తెలంగాణలో నిరంతర విద్యుత్ కోసం కృషి చేశాం
- ఈఆర్‌సి నిబంధనలు కాదని కమిషన్ వేయడం చట్టవిరుద్ధం
- మా ప్రభుత్వానికి దురుద్దేశాలు అంటకట్టే ప్రయత్నాలు సరికాదు
- కమిషన్ ముందుకు వచ్చి వివరణ ఇవ్వాల్సిన పనిలేదు
- వీలైతే మీరు రాజీనామా చేసి వెళ్లిపోండి
- జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డికి కేసీఆర్ లేఖ



హైదరాబాద్,జూన్15 (ప్రజా మంటలు): విద్యుత్ కొనుగోలు, పవర్ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో అన్ని రకాల చట్టాలు, నిబంధనలు పాటిస్తూ ముందుకెళ్లామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర అనుమతులు సాధిస్తూ ముందుకెళ్లామని చెప్పారు. ఈఆర్‌సీ సంస్థలు వెలువరించిన తీర్పులపై కమిషన్లు వేయకూడదన్న విషయం కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. కమిషన్ చట్టవిరుద్ధమని ప్రభుత్వానికి సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విరుద్ధమని చెప్పారు. రాజకీయ కక్షతోనే విచారణ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. విద్యుత్ కొనుగోలు విషయంలో జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి కమిషన్‌కు కేసీఆర్ వివరణ ఇచ్చారు. ఈమేరకు కమిషన్‌కు 12 పేజీల లేఖ రాశారు.'రాష్ట్రం ఏర్పడినప్పుడు విద్యుత్ రంగం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. కరెంటు సరిగా లేక లక్షలాదిగా మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఒక భద్రతా సిబ్బంది సహా 8మంది మావోయిస్టులు మృతి

రాయపూర్,జూన్15 (ప్రజా మంటలు): ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపుర్‌లో మరోమారు ఎన్‌కౌంటర్ జరిగింది. ఎదురుకాల్పుల్లో 8 మంది నక్సలైట్లు, ఒక భద్రతా సిబ్బంది మృతిచెందారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. అబుజ్‌మాడ్ అడవుల్లో ఇవాళ ఉదయం ఎన్‌కౌంటర్ మొదలైంది. నారాయణపుర్, కంకేర్, దంతేవాడ, కొండగావ్ జిల్లాలకు చెందిన భద్రతా దళాలు యాంటీ నక్సల్ ఆపరేషన్ చేపడుతున్న సమయంలో ఎదురుకాల్పులు జరిగినట్లు రాయ్‌పూర్ సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ఇంకా అక్కడ ÷రిరగ్ నడుస్తున్నట్లు చెప్పారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, 53 బెటాలియన్ ఐటీబీపీకి చెందిన దళాలు జూన్ 12వ తేదీన కూంబింగ్ ఆపరేషన్ మొదలుపెట్టాయి. ఎన్‌కౌంటర్‌కు చెందిన మరిన్ని వివరాలు అందాల్సి ఉన్నది.



మొదటి పేజీ తరువాయి

# అంతా కేసీఆరే చెప్పినట్టే చేశాం..

అనంతరాములు కమిటీ రిపోర్టునుపట్టించుకోలేదని అన్నారు. రిపోర్టును అప్పటి ఇరిగేషన్ మినిస్టర్ హరీష్ రావు కేసీఆర్‌కు అందించినా తాను సంతకం చేయకుండా ఓ మూలన పడేశారని వాపోయారు. అనంతరం జస్టిస్ ఘోష్ స్పందించారు. తాను పిలిస్తే ఎవరైనా విచారణకు రావాల్సిందేనని తేల్చిచెప్పారు. విచారణకు రాకపోతే తనకు ఏం చేయాలో తెలుసన్నారు. రిటైర్డ్ ఇంజనీర్లతో సమావేశమైన ఘోష్ కాళేశ్వరం ప్రాజెక్టులోని సబ్ క్రాంటాక్ట్ వ్యవస్థపై ఆరా తీశారు. కాంట్రాక్ట్ ఏజెన్సీల అకౌంట్స్, బ్యాంక్ స్టేట్‌మెంట్స్ పరిశీలించే యోచనలో ఉన్నారు. వీటితో పాటు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ నుంచి డేటా తీసుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఆ అకౌంట్ల లెక్కలు చూస్తే అసలు విషయం బయట పడుతుందని.. ఎంత మొత్తం చేతులు మారాయనేదానిపై స్పష్టత వస్తుందన్నారు.ఇప్పటివరకు 10 నుంచి 15 సబ్ కాంట్రాక్ట్‌లు ఇచ్చారని ఘోష్ నేతృత్వంలోని కమిషన్ వాటి వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇక ఇప్పటికే అఫిడవిట్లు దాఖలు చేయాలని ఆదేశించిన కమిషన్.. అవి పరిశీలించాక అవసరమైతే సీడబ్ల్యూసీ వారిని పిలుస్తామన్నారు ఘోష్. ఇక ఏఈఈ, డీఈఈలను విచారించాలా లేదా అనేదానిపై తర్వాత తెలుపుతామన్నారు. ప్రస్తుతానికి ఇంజనీర్లతో సమావేశం ముగిసిందని అఫిడవిట్లు వచ్చాకే తదుపరి విచారణ అంటూ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ స్పష్టం చేశారు.

**పిలిస్తే ఎవరైనా విచారణకు రావాల్సిందేనన్న ఘోష్**

మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మించాలన్నది కేసీఆర్ ప్లానేనని రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ కాళేశ్వరం కమిటీకి రిపోర్ట్ ఇచ్చింది. ఈ నివేదికలో కీలక అంశాలను ప్రస్తావించింది. తుమ్మిడిహెట్టి వద్ద తాము ప్రపోజ్ చేసినా వద్దని పక్కన పడేశారని తెలిపింది. రిపోర్ట్‌ను అప్పటి ఇరిగేషన్ మినిస్టర్, సీఎం కేసీఆర్‌కు అందించినా సంతకం చేయలేదని ఇంజినీర్లు తెలిపారు. ఈ మేరకు అప్పుడు ప్రపోజ్ చేసిన నివేదికను రిటైర్డ్ ఇంజినీర్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిటీకి అందజేశారు. అనంతరం పీసీ ఘోష్ మీడియాతో చిట్ చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం సబ్ కాంట్రాక్టర్లను గుర్తించే పనిలో ఉన్నామని తెలిపారు. ఆ సంస్థలకు సంబంధించిన డేటాను రిజిస్ట్రార్ ఆఫ్? కంపెనీస్ నుంచి తీసుకుంటామని చెప్పారు. ఆయా కంపెనీల ఖాతాలు, బ్యాంక్ స్టేట్మెంట్స్ పరిశీలిస్తే ఎంత మొత్తం చేతులు మారిందనేది తెలుస్తుందని చెప్పారు. అసిస్టెంట్ డిప్యూటీ ఇంజనీర్లను పిలువాలా.. వద్దా.. అనే అంశంపై కసరత్తు చేస్తున్నట్టు చెప్పారు. విచారణకు పిలిస్తే ఎవరైనా రావాల్సిందేనని పీసీ ఘోష్ అన్నారు. రాకుంటే ఏం చేయాలో తమకు తెలుసునని చెప్పారు. ఈ విషయంలో తనకు అధికారాలున్నాయని అన్నారు. అన్ని అఫిడవిట్లను పరిశీలించిన తర్వాతే సెంట్రల్ వాటర్ కమిషన్ వాళ్లను పిలుస్తామని చెప్పారు. ఏఈఈ, డీఈఈలను విచారించాలా..? వద్దా..? అన్నది తర్వాత ఆలోచిస్తామని చెప్పారు. ప్రస్తుతానికి ఇంజనీర్లతో విచారణ పూర్తయిందన్నారు. వాళ్ల నుంచి అఫిడవిట్లు వచ్చాక ముందుకు వెళ్తామని అన్నారు. మొత్తం 10 నుంచి 15 సబ్ కాంట్రాక్ట్‌లు ఇచ్చారు. వాటి వివరాలను సేకరించే పనిలో కమిషన్ నిమగ్నమైంది.

## ఈ కమిషన్ రాజకీయ కక్ష సాధింపు కోసమే

వ్యవసాయ పంపుసెట్లు కాలిపోయిన పరిస్థితి. పారిశ్రామిక రంగంలో ప్రతి వారంలో కొన్ని రోజులు పవర్ హాలిడే ప్రకటించారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు ఇచ్చిన కరెంటు ఏమాత్రం సరిపోదు. తెలంగాణ విద్యుత్ పంపిణీ వ్యవస్థ పటిష్ఠానికి నిర్మాణాత్మక చర్యలు తీసుకున్నాం. అన్ని రకాల అనుమతులు పొంది ముందుకు పురోగమించడం జరిగింది. రాజకీయ కక్షతో తనను, అప్పటి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాల్జేయడానికే కమిషన్ వేశారు. మా ప్రభుత్వం గణనీయ మార్పుతో కరెంటు ఇచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. మా మార్పును తక్కువ చూపించేందుకే ప్రభుత్వ ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. పత్రికా విలేకఖరుల సమావేశంలో కమిషన్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడింది. విచారణ అనేది ఒక పవిత్రమైన బాధ్యత. ఇరుపక్షాల మధ్య మధ్యవర్తిగా నిలిచి నిజాలు నిగ్గుతేల్చాలి. అన్ని కోణాల్లో సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు వెల్లడించాలి. గత ప్రభుత్వానికి వ్యతిరేకంగా రిపోర్టు ఇవ్వాలని మాట్లాడుతున్నట్లుంది. ఇప్పటికే నష్టం జరిగినట్లు.. ఆర్థిక నష్టాన్ని లెక్కిస్తున్నట్లు మీ మాటలు ఉన్నాయి. మీ విచారణలో నిష్పాక్షికత ఎంతమాత్రం కనిపించట్లేదు. నేను మీ ముందు హాజరై ఏం చెప్పినా ప్రయోజనం ఉండదు. మేం చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకుని వైదొలిగితే మంచిది. మీరు కమిషన్ బాధ్యల నుంచి వైదొలగాలని వినయ పూర్వకంగా కోరుతున్నా' అంటూ కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. పరిస్థితులను గమనించే నాటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విద్యుత్తు అవసరాల దృష్ట్యా విభజన చట్ట ప్రకారం తెలంగాణకు ఇచ్చిన కరెంటు ఎంతమాత్రం సరిపోదు. 2014 నాటి వినియోగాన్ని బట్టి దాదాపు 2,700 మెగావాట్ల కొరత ఉంది.నాటి ఆంధ్రప్రదేశ్ కరెంట్ సరఫరాను ఎగవేయడం వల్ల 1,500 మెగావాట్లు, గ్యాస్ ఆధారిత విద్యుత్తు రాకపోవడం వల్ల 900 మెగావాట్లు కలిపి మరో 2,400 మెగావాట్ల లోటు ఏర్పడింది. మొత్తమ్మీద సుమారు 5,000 మెగావాట్ల కొరతతో తెలంగాణలోని విద్యుత్తు రంగంలో తీవ్ర సంక్షోభం ఏర్పడింది. విద్యుత్తు సంక్షోభం నుంచి గట్టెక్కడానికి శాశ్వత ప్రయోజనాలు కోసం విద్యుత్తు పంపిణీ వ్యవస్థను పటిష్ఠపరచాం. ఫలితంగానే రాష్ట్రం ఆవిర్భవించినప్పుడు 7,778 మెగావాట్లుగా ఉన్న రాష్ట్ర స్థాపిత విద్యుత్తు, తర్వాత సుమారు 20,000 మెగావాట్లపైచిలుకుకు చేరింది. దేశంలోనే నాణ్యమైన నిరంతరాయ కరెంటు అన్ని రంగాలకూ సరఫరా చేసిన ఏకైక రాష్ట్రంగా మారింది. 2014 నాటికి తెలంగాణ తలసరి విద్యుత్తు వినియోగం 1,196 యూనిట్లు ఉండగా, పదళ్లలో అది 2,349 యూనిట్లకు పెరిగింది. ఈ విజయాలు ఆషామాషీగా సాధించలేదు. విద్యుత్తు కొనుగోళ్ల విధానంలో, నూతన విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటులో చట్టాలను, నిబంధనలను పాటించాం. ఎలక్ట్రిసిటీ యాక్ట్ 2003ను అనుసరిస్తూ అవసరమైన అన్ని రకాల అనుమతులను పొంది ఎస్.ఇ.ఆర్.సి తీర్పులకు లోబడే చర్యలూ తీసుకున్నాం. దీనిపై అభ్యంతరాలు ఉంటే ఇ.ఆర్.సిలో ఫిర్యాదు చేయవచ్చు. రేవంత్రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యుత్తు విజయాలను సాధించిన గత ప్రభుత్వానికి దురుద్దేశాలను ఆపాదిస్తూ శ్వేతపత్రాలు విడుదల చేశారు. వాటిపై చర్చలు జరిగాయి. రెగ్యులేటరీ సంస్థల తీర్పులపై విచారణ చేయొద్దన్న ఇంగితం లేకండా కమిషన్ ఏర్పాటు చేశారు. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన వ్యక్తి కూడా న్యాయ ప్రాధికార సంస్థల తీర్పులపై ఎంక్వైరీ చేయొద్దని సూచించకుండా బాధ్యతలు స్వీకరించడం విచారకరం. చట్టవిరుద్ధంగా విచారణ ప్రారంభించి, అనేక విషయాలను సమగ్రంగా పరిశీలించకుండానే, పరిగణనలోకి తీసుకోకుండానే పలు అంశాలపై అసంబద్ధమైన వ్యాఖ్యలు చేశారు. వాటిపై నా అభ్యంతరాలను మీకు తెలియజేస్తున్నానని కెసిఆర్ తన లేఖలో వివరించారు.

## రూ.30 లక్షలకు నీట్ పేపర్

ఆడుకోవద్దని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు సూచించిన దానిప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోడానికైనా తాము సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. గ్రేస్ మార్కులు కేటాయించిన 1563 మంది విద్యార్థులకు మళ్లీ ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షల్లో లీకేజీలను అరికట్టేందుకు, కాపీ లేకుండా ఉండేందుకు కేంద్రం పబ్లిక్ ఎగ్జామినేషన్ ప్రివెన్షన్ ఆఫ్ అన్యాయ మీన్స్ యాక్ట్ ను ఆమోదించిందన్న విషయాన్ని కాంగ్రెస్ గుర్తుంచుకుని మాట్లాడాలన్నారు. అందులో కఠినమైన నిబంధనలు ఉన్నాయన్న ఆయన.. కాంగ్రెస్ కు విద్యార్థుల భవిష్యత్ పై రాజకీయాలు చేయడం కొత్తేమీ కాదన్నారు. దేశ అభివృద్ధికి కాంగ్రెస్ సహకరించాలని కోరారు.జులై 3న నీట్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుండగా.. నీట్ పై వచ్చిన పిటిషన్ల తదుపరి విచారణను సుప్రీం జులై 6కు వాయిదా వేసింది.

# ఎన్డీయే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు

కూలిపోవచ్చు. కానీ, ప్రభుత్వం కూలిపోవాలని మేం కోరుకోవట్లేదు. దేశానికి మంచి జరగాలి. అందుకోసం కలిసికట్టుగా పనిచేయాలనే మేం ఆశిస్తున్నాం. కానీ, ప్రధానికి మాత్రం మంచిని కొనసాగించే అలవాటు లేదు. ఏదేమైనప్పటికీ దేశాన్ని బలోపేతం చేయడం కోసం మేం పూర్తి సహకారం అందిస్తాం" అని ఖర్గే వ్యాఖ్యానించారు.అయితే, కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలపై ఎన్డీయే మిత్రపక్షాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాలను గుర్తుచేస్తూ ఖర్గేపై విమర్శలు గుప్పించాయి. "మెజార్టీ రాకుండానే పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాలను నడిపించలేదా? కాంగ్రెస్ చరిత్ర గురించి ఖర్గేకు గుర్తులేదా?" అని జేడీయూ నేత ఒకరు ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 293 సీట్లు సాధించిన సంగతి తెలిసిందే. గత రెండు సార్లు సొంతంగా మెజార్టీ మార్క్ దాటిన భాజపా ఈ సారి 240 సీట్లకు పరిమితమవడంతో కాంగ్రెస్ ఇలాంటి విమర్శలు గుప్పిస్తోంది. అయితే, 1991లో కాంగ్రెస్‌కు కూడా 244 స్థానాలు దక్కగా.. మిత్రపక్షాలతో కలిసి పీవీ నరసింహారావు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2004లో కాంగ్రెస్ 114 స్థానాల్లో గెలుపొందగా.. మిత్రపక్షాల అండతో మన్మోహన్ ప్రధాని అయ్యారు.

# భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

## పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

ప్రభుత్వం పాలనాపరమైన ప్రక్షాళనలో భాగంగా పెద్దఎత్తున మార్పులు చేసింది. వివిధ జిల్లాల కలెక్టర్లను బదిలే చేస్తూ కొత్తవారిని నియమిస్తూ ఆదేశాలు ఇచ్చింది.బదిలీ అయిన కలెక్టర్ల వివరాలు ఇలావున్నాయి. ఖమ్మం: ముజామిల్ ఖాన్, నాగర్‌కర్నూల్: సంతోష్, భూపాలపల్లి: రాహుల్‌శర్మ, కరీంనగర్: అనురాగ్ జయంతి, పెద్దపల్లి: కోయ శ్రీహర్ష, జగిత్యాల: సత్యప్రసాద్, మంచిర్యాల: కుమార్ దీపక్, మహబూబ్‌నగర్: విజయేంద్ర, హనుమకొండ: ప్రావీణ్య, నారాయణపేట్: సిక్తా పట్నాయక్, సిరిసిల్ల: సందీప్‌కుమార్ ఝా, భద్రాద్రి కొత్తగూడెం: జితేష్ వి పాటిల్, వికారాబాద్: ప్రతీక్ జైన్, కామారెడ్డి: ఆశిష్ సంగ్వాన్, నల్గొండ: నారాయణరెడ్డి, వనపర్తి: ఆదర్శ్ సురభి, సూర్యాపేట కలెక్టర్: తేజస్ నందలాల్ పవార్, వరంగల్: సత్య శారదాదేవి, ములుగు: దివాకరా, నిర్మల్: అభిలాష అభినవ్ ఉన్నారు.ఈ బదిలీల్లో పలువురు కలెక్టర్లను మార్చారు. సుమారుగా 20 జిల్లాలకు కలెక్టర్లను బదిలీ చేశారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్‌ను ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా, మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా, ట్రాన్స్‌కో జేఎండీ సందీప్ కుమార్ ఝాను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా, అనురాగ్ జయంతిని కరీంనగర్ జిల్లా కలెక్టర్గా, నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను కామారెడ్డిజిల్లా కలెక్టర్‌గా, జితేష్ వి పాటిల్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా, రాహుల్ శర్మను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా, పీ ప్రావీణ్యను వరంగల్ జిల్లా కలెక్టర్ నుంచి హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా, సత్యప్రసాద్‌ను ఖమ్మం అదనపు కలెక్టర్ నుంచి జగిత్యాల కలెక్టర్‌గా బదిలీ చేశారు. కోయ శ్రీహర్షను పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా, విజయేంద్ర బోయిని మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా, కుమార్ దీపక్‌ను మంచిర్యాల కలెక్టర్‌గా, ప్రతీక్ జైన్‌ను వికారాబాద్ కలెక్టర్‌గా, నారాయణరెడ్డి వికారాబాద్ కలెక్టర్‌గా, ఆదర్శ సురభిని వనపర్తి జిల్లా కలెక్టర్‌గా, తేజస్ నంద్‌లాల్‌ను సూర్యాపేట జిల్లా కలెక్టర్‌గా, సత్య శారదాదేవిని వరంగల్ జిల్లా కలెక్టర్‌గా, దివాకర్‌ను ములుగు జిల్లా కలెక్టర్‌గా, అభిలాష అభినవ్‌ను నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

# ఇందిరా గాంధీనే 'మదర్ ఆఫ్ ఇండియా'

**- కమ్యూనిస్టు నాయనార్‌లు, కాంగ్రెస్ నేత కరుణాకరన్‌లు నా రాజకీయ గురువులు**

**- కేంద్రమంత్రి సురేష్ గోపీ సంచలన వ్యాఖ్యలు**

త్రిశ్శూర్ (ప్రజా మంటలు):

కేరళలోని త్రిశ్శూర్ లోక్‌సభ స్థానం నుంచి భాజపా తరపున ఎన్నికైన సినీ నటుడు సురేశ్ గోపి కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీని 'మదర్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించారు. కేరళకు చెందిన కాంగ్రెస్ మాజీ సీఎం కె.కరుణాకరన్, మార్క్సిస్టు నేత ఈకే నాయనార్‌లు తన రాజకీయ గురువులుగా పేర్కొన్నారు. మోదీ కేబినెట్‌లో సహాయ మంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన.. శనివారం త్రిశ్శూర్‌లో పర్యటించారు. కరుణాకరన్ స్మారకమైన మురళీ మందిరాన్ని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. తన గురు సమానులైన కరుణాకరన్‌కు నివాళులర్పించేందుకే ఇక్కడికి వచ్చానని సురేశ్ గోపి పేర్కొన్నారు. దీనికి రాజకీయాలను ఆపాదించొద్దని విలేకరులకు సూచించారు. కరుణాకరన్‌తో తనకు మంచి సంబంధాలు ఉండేవని, ఆయన సతీమణి కల్యాణి కుట్టి తనకు తల్లి వంటి వారని పేర్కొన్నారు. మార్క్సిస్టు నేత నాయనార్, ఆయన భార్య శారద టీచరన్‌ను సైతం తల్లిదండ్రులతో సమానంగా భావిస్తానని చెప్పారు. కన్నూర్‌లోని నాయనార్ నివాసాన్ని ఇటీవలే సందర్శించినట్లు చెప్పారు.ఈసందర్భంగా ఇందిరాగాంధీని మదర్ ఆఫ్ ఇండియాగా అభివర్ణించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మూల పురుషుడు కరుణాకరన్ అని చెప్పారు. పాలనా విషయాల్లో ఆమె సాహసోపేత నిర్ణయాలు తీసుకునేవారని పేర్కొన్నారు. 2019లోనే మురళీ మందిరాన్ని సందర్శించాలని అనుకున్నానని, రాజకీయ కారణాల వల్ల అప్పట్లో కుదరలేదన్నారు.త్రిశ్శూర్ స్థానం నుంచి సురేశ్ గోపి విజయం సాధించారు. సీపీఐ నేత వీఎస్ సునీల్‌కుమార్‌పై 74 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. సురేశ్ గోపికి 4.12 లక్షల ఓట్లు రాగా, సునీల్ కుమార్‌కు 3.37 లక్షల ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ నేత కె.మురళీధరన్‌కు 3.28 లక్షల ఓట్లు పోలయ్యాయి. సురేశ్ గోపి కొనియాడిన కరుణాకరన్ తనయుడే ఈ మురళీధరన్.

# కర్ణాటకలో పెట్రో రాష్ట్ర సుంకం పెంపు

**- లీటర్ పెట్రోల్‌పై 3కు పైగా పెరుగుదల..**

**- వెంటనే అమల్లోకి ఆదేశాలు**

బెంగళూరు (ప్రజా మంటలు):

వాహనదారులకు కర్నాటకలో కాంగ్రెస్ సర్కారు షాకిచ్చింది. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. ఈ మేరకు పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ పెంచినట్టు కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు శనివారం మధ్యాహ్నం నోటిఫికేషన్ విడుదల చేసింది. కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వాహనదారులకు గట్టి షాకిచ్చింది. పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్ర పరిధిలోని సేల్స్ ట్యాక్స్‌ను పెంచింది. దీంతో వీటి ధరలు రూ.3 మేర పెరిగాయి. ఈ పెంపు తక్షణమే అంటే శనివారం నుంచే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. ఈమేరకు శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. పెట్రోల్‌పై కర్ణాటక సేల్స్ ట్యాక్స్‌ను 25.92శాతం నుంచి 29.84శాతానికి పెంచారు. ఇక, డీజిల్‌పై అమ్మకం పన్నును 14.3 శాతం నుంచి 18.44 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. తాజా పెంపుతో రాష్ట్రంలో లీటర్ పెట్రోల్ ధర రూ.3, డీజిల్ ధర రూ.3.05 మేర పెరుగుతున్నట్లు కర్ణాటక పెట్రోలియం డీలర్స్ అసిసోయేషిన్ తెలిపింది. దీంతో బెంగళూరులో లీటర్ పెట్రోల్ ధర రూ.102.86, డీజిల్ ధర రూ.88.94కు చేరింది. ఈ పెంపుతో రాష్ట్ర ఖజానాకు ఏటా రూ.2,500-2,800 కోట్ల మేర ఆదాయం సమకూరనున్నట్లు కర్ణాటక ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి. చివరిసారిగా రాష్ట్రంలో 2021 నవంబరులో అప్పటి భాజపా సర్కారు పెట్రోల్, డీజిల్ ధరలను సవరించింది. కొవిడ్ తర్వాత ప్రజలకు ఊరట కల్పించేందుకు పెట్రోల్‌పై రూ.13.30, డీజిల్‌పై రూ.19.40 మేర తగ్గించింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ధరలను సవరించడం మళ్లీ ఇప్పుడే. కాగా.. లోక్‌సభ ఎన్నికలు పూర్తయిన వెంటనే చమురు ధరల పెంపుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం గమనార్హం.ఈ పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ప్రభుత్వ నోటిఫికేషన్ అందుకున్న 'అఖిల కర్ణాటక ఫెడరేషన్ ఆఫ్ పెట్రోలియం ట్రేడర్స్'.. నోటిఫికేషన్‌కు అనుగుణంగా పెట్రో రేట్లను సవరించినట్లు వెల్లడించింది.

## వెన్నుపోటు పొడిచినవారికి తలుపులు మూసేశాం

**- షిండే వర్గానికి హెచ్చరిక చేసిన ఉద్ధవ్ థాక్రే**

ముంబై (ప్రజా మంటలు):

మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే కీలక వ్యాఖ్యలు చేశారు. తనను వీడిన వారిని తిరిగి పార్టీలోకి తీసుకోబోనని తెలిపారు. సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన వర్గానికి ఈ మేరకు మెసేజ్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో శనివారం ఆ కూటమి నేతలు సమావేశమయ్యారు. ఎన్సీపీ(ఎస్పీ) అధినేత శరద్ పవార్, కాంగ్రెస్ నేత పృథ్వీరాజ్ చవాన్, కూటమిలోని ఇతర సీనియర్ నేతలతో పాటు ఉద్ధవ్ ఠాక్రే కూడా మీడియాతో మాట్లాడారు. ఏక్‌నాథ్ షిండే శిబిరంలోని శివసేన నాయకులను వెనక్కి తీసుకునే అవకాశాన్ని ఆయన తోసిపుచ్చారు. 'నన్ను విడిచిపెట్టిన వారిని పార్టీలోకి తిరిగి తీసుకోను' అని స్పష్టం చేశారు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ప్రతిపక్ష కూటమి కలిసి పోటీ చేస్తుందని ఉద్ధవ్ ఠాక్రే తెలిపారు. ÷ూజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే తమ పోరాటమని చెప్పారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వం మాదిరిగా మారిందని అన్నారు. ఈ ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చూడాలని వ్యాఖ్యానించారు. తమ ఎంవీఏ ప్రభుత్వాన్ని మూడు చక్రాల రిక్షాగా దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారని, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పరిస్థితి కూడా అలాగే ఉందని ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు.

# మోదీ ప్రచారం చేసిన అన్నిచోట్లా విజయం సాధించాం

**- మమ్మల్ని గెలిపించినందుకు మోదీ కృతజ్ఞతులు - శరద్ పవార్ ఎద్దేవా..**

ముంబై (ప్రజా మంటలు):


రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ఎక్కడెక్కడ రోడ్‌షోలు, ర్యాలీలు నిర్వహించారో ఆ స్థానాల్లో మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ) విజయకేతనం ఎగురవేసిందని ఎన్సీపీ (ఎస్‌సీపీ) నేత శరద్ పవార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమికి మద్దతిచ్చినందుకు ప్రజలకు తమ కృతజ్ఞతలు తెలపడానికి ఎన్‌సీపీ నేతలు శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే పృథ్వీరాజ్ చవాన్ శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఇందులోభాగంగా శరద్ పవార్ మాట్లాడుతూ "ప్రధానమంత్రి రోడ్‌షోలు నిర్వహించిన ప్రతిచోటా మేము గెలిచాము. అందుకే ప్రజలతో పాటు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెప్పడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను. మా గెలుపు కోసం ప్రచారం చేసిన మోదీకి ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు.

శివసేన, ఎన్సీపీలో చీలికలు వచ్చిన అనంతరం అజిత్ పవార్- నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ భాజపాతో జట్టు కట్టింది. కాబట్టి తమ నుంచి విడిపోయిన ఆయన బంధువు అజిత్ పవార్‌ని తిరిగి తన పార్టీలోకి తీసుకునే అవకాశం లేదని శరద్ పవార్ తేల్చిచెప్పారు.

# బీహార్‌కు అవమానాన్ని మిగిల్చారు

**- ఆయన రాష్ట్రం కోసం నీతీశ్ ఏంచేశారు - ప్రశాంత్ కిషోర్**

పట్నా (ప్రజా మంటలు):



రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. "గతంలో ఆయనతో కలిసి పనిచేసిన నేను ఎందుకు విమర్శిస్తున్నానని ప్రజలు నన్ను అడుగుతున్నారు. అప్పుడు సీఎం వేరే వ్యక్తి. కాని ఇప్పుడు మనస్సాక్షిని భాజపాకు అమ్మకానికి పెట్టారు. ఒక రాష్ట్రానికి నాయకుడిగా ఉండేవాడు అక్కడి ప్రజలు గర్వపడేలా నడుచుకోవాలి. కానీ నీతీశ్ కుమార్ బిహార్‌కు అవమానాన్ని మిగిల్చారు" అని కిశోర్ ఆరోపించారు. మోదీ అధికారంలోకి రావడంలో కీలకపాత్ర పోషించిన నీతీశ్ కుమార్ రాష్ట్ర ప్రయోజనాల కోసం తన పలుకుబడిని ఉపయోగించట్లేదని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా మెజారిటీ మార్కును దాటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కౌంటింగ్‌కు ముందు ప్రశాంత్ కిశోర్ జోస్యం చెప్పారు. అయితే, ఆ పార్టీకి మెజారిటీ మార్కు కంటే సీట్లు తగ్గాయి. ఎగ్జిట్ పోల్స్ తప్పని నిరూపిస్తూ ఇండియా కూటమి 234 లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. అయితే భాజపా సారథ్యంలోని ఎన్డీయేకు మెజార్టీ రావడంతో ప్రధాని మోదీ తిరిగి బాధ్యతలు చేపట్టారు.

# తక్కువ ధరలో నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయాలి

**- పూలు పండ్ల మొక్కల పెంపకంతో ఆదాయం**

**- సౌరవిద్యుత్ యూనిట్ల ఏర్పాటుపైనా ఆరా**

**- అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల**



హైదరాబాద (ప్రజా మంటలు):

విత్తనోత్పత్తితో రైతుల అవసరాలు తీరాలని, పూలు పండ్ల మొక్కల పెంపకంతో ఆదాయం రాబట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ,ఇతరశాఖల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను దేనికోసమైతే కేటాయించాలో, ఆ లక్ష్యాలు నేరవేర్చేవిధంగా ఉపయోగంలోకి తీసుకువ్చి, రైతులకు ప్రయోజనం చేకూర్చాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ముఖ్యంగా విత్తనోత్పత్తిక్షేత్రాలలో విత్తనోత్పత్తి, ప్రభుత్వ నర్సరీలలో పూలు,పండ్ల మొక్కలు ఉత్పత్తి చేసి రైతులకు తక్కువ ధరలో నాణ్యమైన విత్తనాలను, మొక్కలను సరఫరా చేసేవిధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మార్కెటింగ్, గిడ్డంగుల అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులతో సమీక్షిస్తూ, గతంలో సూచించిన విధంగా సౌరవిద్యుత్ యూనిట్లను నెలకొల్పె అవకాశాలపై సంస్థల వారిగా ప్రగతిని ఆరాతీశారు. పహడిషరీఫ్ లో వక్ఫ్ భూములలో ఏర్పాటుచేసిన తాత్కలిక షెడ్లలో సబ్ మార్కెట్ ప్రారంభించేందుకు అవకాశాలను పరిశీలించాల్సిందిగా మార్కెటింగ్ సంచాలకులను ఆదేశించారు. తుమ్మల నాగేశ్వరరావు శనివారం వ్యవసాయ, మార్కెటింగ్, కోఆపరేటివ్ మరియు సంబంధిత కార్పోరేషన్ ల రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ గురించి వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ హరిత మంత్రికి వివరాలు అందించారు. 61.15 కోట్లు విలువగల 1,09,937 క్వింటాళ్ళ విత్తనాలు రైతులకు అందచేసామని, ఇంకా అవసరమున్న మేరకు విత్తనాలు తెప్పించి ఇస్తున్నామని తెలియజేసారు. అదేవిధంగా గతేడాది 15 జూన్ నాటికి 64,34,215 పత్తి ప్యాకెట్లు రైతులకు అందుబాటులో ఉంచగా, ఈ సంవత్సరం 1,02,45,888 ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగిందని, రైతులు ఇప్పటికే 62 లక్షల ప్యాకేట్లు కొనుగోలు చేశారని తెలియజేశారు. గతంలోనే ఆదేశించిన విధంగా ప్రతి విత్తన కంపెనీ రాష్ట్రప్రభుత్వానికి ఇచ్చిన హామీమేరకు విత్తన ప్యాకెట్లు సరఫరా చేసారా, లేదా, ఆ ప్యాకేట్లు అన్ని రైతులకు చేరాయా లేదా కూడా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎరువుల లభ్యతపై వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి మాట్లాడుతూ, జూన్, జులై నెలల అవసరాలమేరకు అన్ని ఎరువులు తెప్పించి రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకున్నామని తెలియజేశారు. 7,97,194 మెట్రిక్ టన్నుల యూరియా, 75,278 మెట్రిక్ టన్నుల డిఎపి, 4,27,057 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 26,396 మెట్రిక్ టన్నుల మ్యూరెట్ ఆఫ్ పోటాష్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలుపగా, కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతు రాష్ట్రానికి అవసరమేర ఎరువులు రెండు నెలల ముందుగానే తెప్పించేవిధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాల్సిందిగా అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా పంటల నమోదు ప్రక్రియ పారదర్శకంగా ఎటువంటి లోపాలకు తావులేకుండా జరగాలని ఆదేశించారు. ఉద్యానశాఖ డైరెక్టర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ, ఆయిల్ పాంల కంపెనీల ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, నిర్ధేశిత లక్ష్యాల మేర ఫలితాలు చూపని కంపెనీలకు నోటిసులు ఇచ్చామని తెలియజేసారు. అటువంటి కంపెనీలపై వెంటనే చట్టప్రకారం తగుచర్యలు తీసుకోవల్సిందిగా మంత్రి సూచించారు. అదేవిధంగా డ్రిప్ మరియు స్పిం÷-రక్లర్స్ సౌకర్యం కేవలం ఆయిల్ పాం పంటకే కాకుండా ఇతర పంటలకు వర్తింపచేసేవిధంగా ఈ ప్రభుత్వం చర్యలు తీసుకొంటుందని, దానికనుగుణంగా ప్రణాళికలు చేసుకోవల్సిందిగా సూచించారు. సమీక్షా సమావేశంలో అగ్రికల్చర్ కార్యదర్శి రఘునందన్ రావు, సత్యశారద , ఆగ్రో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీరాములు వేర్‌హౌస్ మేనేజింగ్ డైరెక్టర్ జితేందర్ రెడ్డి, మార్క్ ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

# చురుగ్గా రుతుపవనాలు

**- తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలకు అవకాశం - పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**



హైదరాబాద్ (ప్రజా మంటలు):

వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతులకు వాతావరణశాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో రానున్న ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతటా చురుగ్గా ఉన్నాయని పేర్కొంది. దీనితోపాటు రాయలసీమ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా.. మధ్య బంగాళాఖాతం వరకు ద్రోణి ఉందని తెలిపింది. ఈ రెండింటి ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, మెదక్, కామారెడ్డి, నాగర్?కర్నూ ల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలర్ట్? జారీ చేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షాలు పడవచ్చని తెలిపింది. హైదరాబాద్ ?లోనూ వర్షాలు పడతాయని తెలిపింది. మరోవైపు నిన్న రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా నిన్న ఉరుములు.. మెరుపులతో కూడిన వర్షం పడింది. భారీగా వీచిన ఈదురుగాలులకు చెట్లు విరిగి కరెంట్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వేములవాడ రాజన్న ఆలయం ఎదుట రోడ్లు జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భద్రాచలం కొత్తగూడెం జిల్లాలోనూ ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. భద్రాచలంలో శుక్రవారం 5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దాంతో రామాలయం వద్ద ఉన్న అన్నదాన సత్రం చుట్టూ నీళ్లు చేరి చెరువును తలపించింది. నిన్న ఒక్కరోజే కురిసిన వర్షానికి స్లూయిస్ బ్రేక్ అవ్వడంతో అన్నదాన సత్రంలోకి నీళ్లు చేరాయి.

# విద్యార్థుల వికృత క్రీడ

**- ప్రొఫెసర్ కళ్లల్లో కారం చల్లి..కర్రలతో దాడి**

**- మధ్యప్రదేశ్‌లో ఘటన**

భోపాల్ (ప్రజా మంటలు):



మధ్యప్రదేశ్‌లో దారుణం జరిగింది. స్టూడెంట్స్ వికృత చేష్టలు పరాకాష్టకు చేరాయి. ప్రొఫెసర్‌పై విద్యార్థులు కారం చల్లి, కర్రలతో దాడి చేసిన ఘటన మధ్యప్రదేశ్ లోని ప్రభుత్వ జేహెచ్ పీజీ కళాశాలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం ఏడుగురు విద్యార్థుల గుంపు కారం పొడి, కర్రలతో కళాశాలలోకి వచ్చారు. అనంతరం ఓ తరగతి గదిలోకి ప్రవేశించి అక్కడ విద్యార్థులకు క్లాస్ చెబుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ నీరజ్ ధాకడ్‌పై ఒక్కసారిగా దాడికి దిగి కళ్లల్లో కారం చల్లి, కర్రలతో కొట్టారు. ఈ హఠాత్పరిణామంతో కంగుతిన్న విద్యార్థులు, ఇతర అధ్యాపకులు దాడి చేస్తున్నవారిని ఆపడానికి ప్రయత్నించారు. నీరజ్‌ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయనకు తీవ్ర గాయాలైనట్లుగా వైద్యులు పేర్కొన్నారు. దాడి దృశ్యాలు రికార్డ్ అయిన సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల కళాశాల స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌కు సంబంధించిన అవకతవకలపై ప్రొఫెసర్ నీరజ్‌కు, కళాశాల పూర్వ విద్యార్థి అన్నూ ఠాకూర్ మధ్య వాగ్వాదం జరిగిందని కళాశాల యాజమాన్యం తెలిపింది. ప్రొఫెసర్ సంతకాన్ని, కాలేజీ స్టాంప్‌ను దుర్వినియోగం చేయడానికి ప్రయత్నించిన ఠాకూర్‌ను నీరజ్ వారించారని ఇది వారి మధ్య ఘర్షణకు దారితీసిందని పేర్కొన్నారు.

# "త్యాగనికి, దైవానికి ప్రతిరూపం నాన్న"



"ఆటల పాటల నవ్వుల పుత్తడి బొమ్మరా! బొమ్మరా!. ఆశగ చూసిన నాన్నకి పుట్టిన అమ్మరా, అమ్మరా! మేఘాల పల్లకి ఎక్కిస్తా లోకాన్ని కొత్తగా చూపిస్తా, వెన్నెలే తనపై కురిపిస్తా..." అంటూ ఓ సినీ కవి గారు నాన్నకి బిడ్డలపై ఉన్న ఆకాశమంత ప్రేమని అద్భుతంగా మలచి చెప్పారు. తండ్రి బిడ్డల అనుబంధానికి, మాటలకందనంత గొప్పగా ఉంది ఈ పాట. అందుకే నాన్న అనే ఈ రెండు అక్షరాలే భరోసా, తీర్చుకోలేని భరోసా. బంధానికి అనుబంధానికి ప్రతీక. అమూల్యమైన ఆ పిలుపే నాన్న. ఇంకా చెప్పాలంటే నాన్న అనే ఈ రెండక్షరాల్ని తలుచుకుంటేనే మనసు ఆనందంతో గల గల పారే సెలయేరులా ఉప్పొంగిపోతుంది. మనసు పురివిప్పిన నెమలి వలె నాట్యం చేస్తుంది. లేలేత ఉదయభానుడి కిరణాలు లాగా కంటిపాప వెలుగులు విరజిమ్ముతుంది. అవును కదండీ ప్రకృతి కూడా అంతలా స్పందించడం వల్లనేమో నాన్నంటే బాధ్యత, నాన్నంటే భరోసా, ధైర్యం, కొండంత బలం. ఎందుకంటే నాన్న ప్రేమ విశ్వజనీనమైన ప్రేమ. ఆ ప్రేమతోనే పిల్లలు కూడా తమ జీవితంలో ఎవరినైనా అనుసరిస్తారు, అనుకరిస్తారు, ఆదర్శంగా తీసుకుంటారు అంటే అది నాన్ననే.

మాతృమూర్తి ఓ అమృతకలశం అయితే ఆ అమృతాన్ని నింపే గొప్ప బంధమే నాన్న. కుటుంబ బంధంలో తండ్రి పాత్ర అద్వితీయమైనది, అనిర్వచనీయమైనది. బిడ్డ పుట్టినప్పటి నుండి 'నా' అనే మాటకు తావులేకుండా గుండెల నిండా ప్రేమని నింపుకున్న గొప్ప శక్తిమంతుడు నాన్న. బిడ్డకు తొలి స్నేహహస్తం నాన్న. బిడ్డలని ఉన్నత స్థాయికి తెచ్చేందుకు తండ్రి సర్వం ధారపోస్తాడు. అందుకే నాన్న అడుగుజాడల్లోనే ప్రతి బిడ్డకి పునాది పడుతుంది. నవమాసాలు మోసిన తల్లి ప్రేమతో గోరుముద్దలు తినిపించి ఆ బిడ్డల ఆకలి తీరుస్తుంది. తండ్రి బిడ్డల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే కార్యక్రమానికి శ్రీకారం చుడతాడు. ఇలా బంగారు బాటలు వేస్తూ తన కష్టాన్ని మనసులోనే దాచుకుని సంతోషం పంచిపెట్టే విధాత. పిల్లల బాగోగుల కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంటాడు. తన ఇష్టాలను బిడ్డలపై రుద్దకుండా వారి ఇష్టాలు, అభిరుచులకు ప్రాధాన్యం ఇస్తాడు. తనలాగే తన బిడ్డలు కష్టాలు పడకూడదని రోజంతా తనే కష్టపడుతుంటాడు నాన్న. ఇలాంటి నాన్నలకు మనం ఏమిచ్చి రుణం తీర్చుకోగలం. ప్రేమగా ఒకసారి 'థాంక్యూ నాన్న' అని అనడం తప్ప. మనసారా 'పితృదేవోభవ' అంటూ దైవంగా భావించే తండ్రి త్యాగనిరతిని స్మరించుకోవడం బిడ్డలుగా మన అందరి బాధ్యత.

అమెరికాకు చెందిన 'సోనో రాజ్' అనే మహిళ తండ్రి గొప్పతనాన్ని పరిచయం చెయ్యడానికి నాన్నకి గౌరవంగా ఒకరోజు ఉండాలని మొదలుపెట్టిన ఈ ఆలోచన కార్యరూపం దాల్చి "పితృ దినోత్సవంగా" మారింది. ఇక ఆమె ఆలోచనల ప్రతిరూపంగా 1910వ సంవత్సరంలో మొదటి సారిగా పితృ దినోత్సవం జరుపుకున్నారు. 1924లో అప్పటి అమెరికా అధ్యక్షుడు కాల్విన్ కులిడ్జ్ హయాంలో పితృ దినోత్సవాన్ని ఇంకా ఘనంగా చేయడం మొదలుపెట్టారు. మరో అడుగు ముందుకు వేసి %స్త్ర%చట్టపరమైన హెూదా కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆ తర్వాత మరో అధ్యక్షుడు లిండన్ పితృ దినోత్సవం రోజు సెలవు దినంగా ప్రకటించారు. ఇలా అంచలంచలుగా ఎదిగి పితృ దినోత్సవానికి జాతీయస్థాయి గుర్తింపు లభించింది. మాతృ దినోత్సవం, స్నేహితుల దినోత్సవం తరహాలోనే జూన్ 3వ ఆదివారం రోజున పితృ దినోత్సవం జరుపుకుంటున్నారు.

నాన్న పిల్లలకు నిజమైన మార్గదర్శకుడు. పిల్లల బాగోగుల కోసం ఏం చేయడానికైనా సిద్ధంగా ఉంటాడు. పిల్లల్లో ఆనందం, వారి మోములో చిరునవ్వుని తన సంతోషంగా భావించి తన సర్వస్వాన్నీ త్యాగం చేస్తాడు. బాధ్యతగా చివరివరకు బిడ్డల ఉన్నతి కోసం అండగా నిలిచే గొప్ప వ్యక్తిత్వం ఆయనది. ఇలా ప్రతి క్షణం వెన్నంటి ఉండే నాన్న అంటే బిడ్డలకు మాటల్లో చెప్పలేని గొప్ప అభిమానం, ప్రేమ. తల్లికి చెప్పుకోలేని సమస్యలు తండ్రికి చెప్పుకుంటున్నారు. నాన్న కూడా తమ పిల్లలతో గొప్ప స్నేహితుడులా మసలుకొంటున్నారు. అందుకే ప్రతి ఇంట్లో సూపర్ హీరో నాన్నే.

"ఓ నాన్న నీ మనసేవెన్న/ అది అమృతం కన్నా ఎంతో మిన్న/ ఓ నాన్నా..." అంటూ సాగే ఈ పాటలో సినీ కవి గారు నాన్న మనసుని అద్భుతంగా ఆవిష్కరించారు. నిజమే కదండీ నాన్న మనసు ఎప్పుడు వెన్నలానే ఉంటుంది. అందుకే ప్రేమానురాగాలతో అమ్మతో సమానంగా లాలించి పెంచుతాడు. బిడ్డలు గారం చేసినా, మారాం చేసినా తండ్రితోటే. కుటుంబ భారాన్ని మోస్తూ రోజంతా పని ఒత్తిడిలో వున్నా నాన్నకి ఎప్పుడు పిల్లలే లోకం, పిల్లలే సర్వస్వం. తన స్థాయికి మించింది అయినా కాకపోయినా తన బిడ్డల కోరుకునే స్థాయి ఇవ్వాలని కోరుకుంటాడు తండ్రి. అందుకే జీవిత పాఠాలు నేర్చుకోవాలి అంటే నాన్నను మించిన గురువు ఈ లోకాన లేరు. ఆయన బాటలో నడిస్తే అనుకున్నది సాధించవచ్చు. తండ్రి అడుగుజాడల్లో నడిస్తే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చు. ప్రేమ, ధైర్యం, సాయం చేసే గుణం, సహనం, పొదుపు, ఆనందం అన్ని మంచి లక్షణాలు నాన్నలో నరనరాన జీర్ణించుకుపోయి అవి మనకి కూడా సమృద్ధిగా లభిస్తాయి. ఇలా తల్లి ప్రేమను చూపిస్తూ, తండ్రి బాధ్యతలు తెలియజేస్తూ ఉంటే పిల్లలు ఓ స్టార్ లా ఆకాశమంత ఎత్తు ఎదుగుతారు.

అలాగే బడిలో గురువు పాఠాలు నేర్పిస్తే బతుకు పోరాటం నేర్పించే గురువు తండ్రి. బిడ్డల లోపాలు సరి చేసి వారి భవిష్యత్తుకు చక్కని పునాది వేస్తాడు. ఒకప్పుడు నాన్నంటే పిల్లలకు భయం, కానీ ఇప్పుడు మాత్రం నాన్నంటే పిల్లలకు ఓ మంచి స్నేహితుడిలా మారిపోయాడు. త్యాగానికి మారు పేరుగా నిలుస్తున్నాడు, దైవానికి ప్రతిరూపం. ఆ దైవం మనం ప్రయోజకులు అయితే పది మందికి గర్వంగా చెప్పుకుని మురిసిపోతాడు. వాళ్లలో తనను చూసుకుని ఆనందిస్తాడు. తన చేతుల్లో పెరిగిన పసితనం తన భుజాలపై పెరిగిన బాల్యం ఇంత ఎత్తుకు ఎదిగిందా అని సంబర పడిపోతాడు. ఇంత గొప్ప తల్లిదండ్రిని మనం కూడా ఎంతో ప్రేమగా చూసుకోవాలి. కాని



బిడ్డల కోసం ఎంతో త్యాగం చేసిన తల్లిదండ్రులను కొద్ది మంది నిర్లక్ష్యం చేస్తున్నారు. తండ్రి గొప్ప మనసు అర్థం చేసుకోవట్లేదు. వృద్ధాప్యం లోకి వచ్చిన తల్లిదండ్రులను నిర్దాక్షిణ్యంగా అనాధాశ్రమంలో చేరుస్తున్నారు. ఇది ఎంతో బాధాకరమైన విషయం. అయినా కూడా ఈ తండ్రులకి బిడ్డలపై ఏమాత్రం చెక్కు చెదరక "ఓనమాలు నేర్పాలని అనుకున్నా కన్నా/అందనంత ఎదిగిన నిను చూస్తున్నా నాన్న/ కలిసొచ్చిన కాలానికి, నడిచొచ్చిన కొడుకుకి స్వాగతం చెబుతున్నా/ నే పసివాడినై నీ నీడని చేరుకున్నా/జీవితాన ప్రతి పాఠం చేదే అనుకున్నా/ తీయనైన మమతల రుచిని నే చూస్తున్నా నాన్న/ గురుదక్షిణగా నీకు అంకితమౌతున్నా..." /( సినీ కవి గారు రాసిన పాట) అంటున్న తల్లిదండ్రుల్ని వృద్ధాశ్రమాల నుంచి విడిపించి తెచ్చి ఇప్పటికైనా ప్రేమగా చూసుకోండి. వారితో రోజులో కనీసం ఓ అరగంట అయినా చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించండి. దైవంగా భావించి పాదాలకు నమస్కరిస్తూ "నా మనసంతా నువ్వే నాన్నా" అంటే చాలు ప్రతి రోజు మన ఇంట పితృ దినోత్సవం వెల్లివిరుస్తుంది.

**పింగళి భాగ్యలక్ష్మి,**
**కాలమిస్టు రచయిత్రి(ఫ్రీలాన్స్ జర్నలిస్ట్),**
**గుంటూరు. 9704725609**

# సిక్కింలో భారీ వర్షం..

## వరదల్లో చిక్కుకుపోయిన 1200 మంది టూరిస్టులు

సిక్కిం,జూన్15 (ప్రజా మంటలు): సిక్కింలో భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ప్రకృతి అందాలను చూసేందుకు వెళ్లిన పర్యాటకులు వరదల్లో చిక్కుకుపోయారు. నార్త్ సిక్కింలో 22 సెంటీమీటర్ల వర్షం కురిసింది. తీస్తాలో వరదలు సంభవించడంతో.. 1200 మంది స్వదేశీ, విదేశీ పర్యాటకులు లాచుంగ్ ప్రాంతంలో చిక్కుకుపోయారు. వర్షాలు తగ్గుముఖం పట్టి.. వాతావరణం అనుకూలించాక పర్యాటకులను తరలించే ఏర్పాట్లు చేస్తామని స్థానిక అధికారులు తెలిపారు. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగి పడటంతో.. ఇళ్లలోకి భారీగా వరదనీరు చేరి నీటమునిగాయి. ఇక భారీ వర్షాలు, వరదలు కొట్టుకుపోయిన, డ్యామేజ్ అయిన రోడ్ల మరమ్మతులకు కనీసం 5-6 రోజుల సమయం పడుతుందన్నారు. ఇప్పటి వరకూ సిక్కింలో వర్షాల కారణంగా ఆరుగురు మరణించారని, వారిలో ముగ్గురి మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయని పేర్కొన్నారు. సంక్లాంగ్ లోని వంతెన వరదనీటిలో కొట్టుకుపోవడంతో.. చుంగ్తాంగ్, లాచుంగ్ ప్రాంతాల నుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సీఎం ప్రేమ్ సింగ్ తమాంగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో చిక్కుకున్న పర్యాటకులను ప్రత్యేక విమానంలో తరలించేందుకు కేంద్రంతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లను వీలైనంత త్వరగా మరమ్మతు చేయాలని ఆదేశించారు.

# పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు

## ఎపి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశం

అమరావతి, జూన్15 (ప్రజా మంటలు): ఏడాదిలోగా పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా చేపట్టాల్సిన పనులతో పాటు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఫేజ్-2, ఫేజ్-3 పనులన్నీ ఏడాదిలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంపై అధికారులను ఆరా తీశారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి దిల్లీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ఇతర రాష్టాల్లో స్కూల్స్ శానిటేషన్‌ను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు మారిన విద్యార్థుల సంఖ్య, అందుకుగల కారణాలను విశ్లేషించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జనరల్ డ్రాప్ అవుట్స్ వివరాలు కూడా అందజేయాలన్నారు. ఎన్ని పాఠశాలలు మూతపడ్డాయి, అందుకు గల కారణాలను కూడా తెలియజేయాలన్నారు. దేశంలోనే బెస్ట్ లైబ్రరీ మోడల్ ఎక్కడ ఉందో తెలుసుకుని, సమీక్ష చేసి అందుకు సంబంధించిన నోట్‌ను సిద్ధం చేయాలని తెలిపారు. బైజూస్ కంటెంట్, ఐఎఫ్‌బీ వినియోగం మీద సమగ్ర నోట్ ఇవ్వాలని సూచించారు.



విద్యార్థులకు కిట్‌లు అందజేసే పక్రియను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జులై 15 నాటికి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఇవ్వాలని ఆదేశించారు. గత ప్రభుత్వం ఇంటర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఇవ్వకపోవడం పట్ల లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో తెదేపా ప్రభుత్వం కొనుగోలు చేసిన సైకిళ్లను వైకాపా ప్రభుత్వం పంపిణీ చేయకుండా మూలన పడేసిన నేపథ్యంలో వాటి వివరాలు ఇవ్వాలని అధికారులను కోరారు. ఇకపై ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా జరుగుతాయని మంత్రి స్పష్టం చేశారు.

# చట్టవిరుద్ధ పోడును అంగీకరించం

## అధికారులపై దాడులను క్షమించం - అధికారులతో సమీక్షించిన మంత్రులు

హైదరాబాద్,జూన్15 (ప్రజా మంటలు): వ్యవసాయం పేరుతో పోడు చట్టాలకు విరుద్ధంగా పోడు భూములను సాగుచేసే వారిపై కఠిన చర్యలు తప్పవని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. పోడు రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, వారి ఉపాధికి భంగం కలుగకుండా, అటవీశాఖ మార్గదర్శకాలను అనుసరిస్తూ అధికారులు పోడు భూముల రక్షణకు కృషి చేయాలని ఆమె ఆదేశించారు. అదే సమయంలో పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతు కుటుంబాలు సున్నిత పరిస్థితుల్లో అటవీశాఖ అధికారులకు ఎలాంటి హాని తలపెట్టవద్దని, ఆపై క్రమశిక్షణ చర్యలకు గురికావద్దని హెచ్చరిక చేశారు. శనివారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పోడు భూముల సమస్యలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి ప్రసాద్, అడిషనల్ సెక్రెటరీ ప్రశాంతి, డిప్యూటీ సెక్రెటరీ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పోడు రైతుల హక్కులను కాపాడటంలోనూ, అదే సమయంలో అటవీశాఖ భూములను కాపాడే అధికారులకు రక్షణ కల్పించడంలోనూ ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతున్నదని మంత్రి సురేఖ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఏళ్లుగా పోడు భూములను సాగుచేసుకుంటున్న రైతు కుటుంబాల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని, వ్యవసాయం పేరుతో మార్గదర్శకాలకు, చట్టాలకు విరుద్ధంగా కొత్తగా పోడు భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు చేపట్టాల్సి వస్తుందని మంత్రి హెచ్చరించారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కాల్పోల్ గ్రామంలో ఎఫ్ఆర్ఓ, సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్లపై గిరిజనులు చేసిన దాడిని ఆమె ప్రస్తావించారు. ప్రజల ప్రయోజనాలకు ఎంత ప్రాధాన్యం ఇస్తామో.. రాష్ట్ర అటవీ సంపద, సహజ వనరుల పరిరక్షణకు అంతే ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు.



# ఘనంగా బోనాల జాతర నిర్వహణ

## ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రులు



హైదరాబాద్,జూన్15 (ప్రజా మంటలు): వచ్చే నెల జూలైలో జరగబోయే బోనాల జాతరను ఘనంగా జరిపించేందుకు ప్రభుత్వం సిద్ధం అవుతుంది. జూబ్లీహిల్స్ ఎంసీహెచ్ఆర్ డిలో బోనాల పండుగ ఏర్పాట్లపై రివ్యూ మీటింగ్ జరిగింది. ఆషాఢ మాసం బోనాలు పండుగ ఘనంగా ఏర్పాట్లు చేసేందుకు ప్రభుత్వం అన్ని శాఖలతో మీటింగ్ జరిగింది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు దిశానిర్ధేశర చేశారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి , రాజ్యసభ సభ్యులు అనిల్ యాదవ్ ,వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఆషాఢ మాసం బోనాల జాతర ను విజయవంతం చేసుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలు , శాంతి భద్రతలు ,దేవాలయాల వద్ద భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లు తదితర అంశాల పై సమీక్షా సమావేశంలో చర్చించారు.

సంపాదకీయం

# బెడిసి కొట్టిన కాంగ్రెస్ ముక్త భారత్ !

కాంగ్రెస్ ముక్త భారత్ అంటూ మోడీ చేసిన ప్రకటన..బూమరాంగ్ అయ్యింది. తొలుత ఈ నినాదంతో కొందరు ఆనందించారు. నిజమే ...వారసత్వ రాజకీయం ఎందుకులే అని ప్రజలు అనుకున్నారు. కానీ మోడీ పిలుపునకు అనుగుణంగా పాలన చేయలేకపోయారు .ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ..ముందుకు సాగివుంటే కాంగ్రెస్ ముక్త భారత పనిచేసివుండేది. కానీ మోడీ కేవలం కాంగ్రెస్‌ను బూచిగా చూపి, సమస్యల పరిష్కారం లో పూర్తిగా విఫలం అయ్యారు. అంతేగాకుండా గతం కన్నా దుర్లభంగా జనం బతుకులు మార్చారు. గతరెండు పర్యాయాలు గెలిచేసరికి ఇక తనకు తిరుగులేదని భావించారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను కూడా దూరం పెట్టారు. పార్టీలో సీనియర్లను ముందే తొక్కిపెట్టారు. రాహులన్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. కేసులు పెట్టించి నానా ఇక్కట్లకు గురి చేశారు. విపక్ష సిఎంలను అరెస్ట్ చేయించారు. విపక్ష పార్టీల నేతలనే టార్గెట్ చేసి ఇడి, ఐటి కేసులతో వేధించారు. వెరసి మొన్నటి ఎన్నికల్లో మోడీ ఓ రకంగా చెప్పాలంటే ఓటమి పాలయ్యారు. ఇప్పుడు బలపరుస్తున్న ఎన్‌డిఎ నేతలు ప్లేట్ ఫిరాయిస్తే కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుంది. వారణాసిలో మా చెల్లి ప్రియాంకను నిలిపివుంటే..మోడీ ఓడిపోయే వారని రాహుల్ చేసిన వ్యాఖ్యలు అక్షరాల నిజం. అక్కడ ప్రియాంక నిలిచివుంటే పరిస్థితి మరోలా ఉండేది. రాహుల్ ఎక్కడా విజయం సాధించలేరని సాక్షాత్తు మోడీ యే ప్రచారం చేసినప్పటికీ రాహుల్ గాంధీయే ప్రధాన ప్రతిపక్ష నాయకునిగా ఇప్పుడు మోడీకి దీటుగా నిల బడ్డారు. గత పదేళ్ల కాలంలో ఏకచ్ఛత్రాధిపత్యం వహిం చిన ఎన్‌డిఎ ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో విపక్షాల గొంతు వినిపించకుండా, చర్చకు అవకాశం ఇవ్వకుండా కర్రపెత్తనంతో వ్యవహరించి బుల్‌డోజ్‌లా దూసుకు పోయింది. ఈ నేపథ్యంలో గత లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టి ఏకపక్షంగా పాస్ చేయించుకున్నారు. ఎన్‌డిఎ మందబలంతో ఆమోదం పొందగలిగాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలు భయంతో మద్దతు ఇచ్చాయి. ఇదంతా విపక్షాల గొంతు వినిపించకుండా చేసినవే నన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అలాంటి దూకుడు పని చేయదని మోడీ గుర్తించాలి. తన వైఫల్యాలే కాంగ్రెస్‌కు ఊపరి పోశాయని గుర్తించాలి. అవతలి పక్షం ఇప్పుడు బలంగా ఉంది. ఎన్‌డిఎ పసక్షాల ఎంపి లంతా తలచుకుంటే మోడీ ఖేల్ ఖతమని గుర్తించాలి. పార్లమెంట్ అంటేనే ప్రజల సమస్యలపై చర్చించడం అన్న విధానానికి తూట్లు పొడ చారు. వాజ్‌పేయ్, అద్వానీల హయాంలో పార్లమెంటు లో ప్రజాస్వామ్య బద్దంగా చర్చలు సాగేవి. బిల్లులపై చర్చించేవారు.

ఎందుకు బిల్లుల అవసరముందో చెప్పే వారు. కానీ మోడీ పదేళ్ల ప ఆలనలో ఒక్క బిల్లుపైనా చర్చించలేదు. వచ్చేనెల పార్లమెంట్ సమావేశాల్లో ఇక మోడీ ద్వయం హుందాగా వ్యవహరించి, విపక్షాలకు చర్చ చేసే అవకాశం ఇవ్వాలి. తమ పాతపద్దతులను, వాసనలు వదులుకుని పార్లమెంట్‌కు రావాల్సి ఉంటుంది. సభలో ఏకాభిప్రాయంతో ఆచితూచి ముందుకెళ్లక తప్పదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ముందు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల సమస్యలు, రైతుల సమస్యలు సవాలుగా ఉం టున్నాయి. వీటిని పరిష్కరించవలసి ఉంటుంది. పంజాబ్, హర్యానా, రాజస్థాన్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలను పీడిస్తున్న వ్యవసాయ సంక్షోభం కేంద్రం పరిష్కరించడం తక్షణ కర్తవ్యం. వ్యవసాయ రంగంలో అనుభవం సంపాదించిన శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధిశాఖల మంత్రిగా కేంద్రం నియమించి మంచి పనిచేశారు చౌహాన్ మధ్యప్రదేశ్‌లో వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించగలి గారు. కేంద్రం కీలకమైన శాఖలను తన పాత మంత్రులకే అప్పగించి సంకీర్ణంలో భాగస్వాములైన మిత్ర పక్షాలకు మొక్కుబడి శాఖలిచ్చి బుజ్జగించింది. మిత్ర పక్షాలు కూడా దీనికి కట్టుబడక తప్పడం లేదు. ప్రాధాన్యమైన శాఖల కోసం మిత్రపక్షాలు డిమాండ్ చేసే అర్హత ఉన్నప్పటికీ, తమ మీద ఉన్న ఒత్తిళ్ల కారణంగా ఈ పార్టీలన్నీ కేంద్ర సాయం కోసం ఆధారపడక తప్పడం లేదు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు ఆంధ్రను ఆర్థిక అవస రాలు తీవ్రంగా ఉన్న దశలో స్వీకరిస్తున్నారు. రాజధాని నిర్మాణానికి, పథకాల అమలుకు కేంద్రం ఆర్థిక చేయూత తప్పనిసరి ఇక బీహార్ సిఎం నితీశ్ కుమార్ పరిస్థితి కూడా ఇంతే. బీహార్ రాష్ట్రం కూడా అనేక పథకాలకు ఆర్థిక సాయం కోసం కేంద్రం వైపు చూస్తోంది. మోడీ కూడా ఈ అవకాశాలను కాదనలేరు. కొత్త ప్రభుత్వం మనుగడ సాగించడానికి ఎప్పటి కప్పుడు ఏకాభిప్రాయ సాధనే అత్యవసరమవుతుంది. నోట్ల రద్దు, వ్యవసాయ బిల్లుల అమలు కోసం అప్పుడు పార్లమెంట్‌లో అంతగా చర్చ సాగలేదు. యూనిఫారం సివిల్ కోడ్, లేదా వన్ నేషన్, వన్ ఎలక్షన్ వంటి వివాదాస్పద అంశాలు సుల భంగా చర్చకు రాలేదు. ఇప్పుడు విపక్షాల బలం గట్టిగానే ఉంది. ప్రధాని మోడీ పార్లమెంట్‌లో ఏ బిల్లుపైనా ఆమోదం సాధించాలంటే చర్చించి ఏకాభిప్రాయం సాధించడం కానీ లేదా స్థాయీ సంఘానికి పరిశీలనకు పంపించడం కానీ చేయక తప్పదు. అలాగే ఎన్‌డిఎ పక్షాలను కాదని అడుగు వేసే పరిస్థితి లేదు. అందువల్ల ఆచితూచి అడుగేయాలి. అలాగే ఇప్పుడంతా రాజీ రాజకీయాలు నడుస్తు న్నాయి. నేతలు తమ రాజకీయ వ్యూహాలకు పదను పెడుతున్నారు. ఒకప్పుడు ప్రతిపక్ష రాజకీయాలలో కీలక పాత్ర పోషించడంతో పాటు, ఎన్డీఏలో కూడా కీలక భాగస్వామిగా ఉండి, వాజపేయి ఏడేళ్లపాటు ప్రధానిగా ఉన్న సమయంలో ఎన్డీఎ కన్వీనర్‌గా ఉన్న చంద్రబాబు నాయుడు ఇప్పుడు రాజకీయంగా బలపడ్డార నే చెప్పాలి. జాతీయ స్థాయిలో బిజెపి చతికిలపడడంతో చంద్రబాబుకు కలసి పనిచేసే అవకాశం దక్కడం గమనార్హం. దీంతో మోదీ మళ్లీ ప్రధాని కావడంతో ఆయన ఆపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఓ రకంగా చెప్పాలంటే చంద్రబాబు జాతీయ రాజకీయాల్లో మళ్లీ అడుగు పెట్టారనే చెప్పాలి. నితీశ్ కుమార్, చంద్రబాబు, చిరాగ్ పాశ్వాన్, అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండేలు బలంగా ఉన్నారు. ఈ కారణంగా మోడీ దేశహితం కోసం, ప్రజాసంక్షేమం కోరి నిర్ణయాలు తీసుకోవాలి. ఉమ్మడి నిర్ణయాలే అసవరం అవుతాయి. కలసి సాగాల్సిన సమయంలో పార్లమెంటులో ప్రజాస్వామ్యయుతంగా ఉండాల్సిందే.స్థానిక పరిస్థితులను బట్టి కాంగ్రెస్, బీజేపీతో సర్దుబాటు చేసుకోవడం ప్రాంతీయ పార్టీలకు కొత్త కాదు. అయితే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడ్డ టిడిపిని కాంగ్రెస్‌తో జతకట్టేందుకు గతంలో చంద్రబాబు వెనకాడ లేదు. అయితే ఇక్కడ బిజెపి కూడా తన రాజకీయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాజకీయాలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడున్న పరిస్థితులలో కేంద్ర ప్రభుత్వ సహకారం లేకుండా ముందుకు కదలని పరిస్థితి ప్రభుత్వానికి ఉంది. ప్రాంతీయ పార్టీలు రాష్ట్రాల అవసరాల కోసం ఎవరితోనైనా జతకడతారు. అందువల్ల మోడీ జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది.

## కాలాన్ని వశం చేసుకోవడం దుర్లభం !

తిరుమల,జూన్15 (ప్రజామంటలు): కాలం భగవంతుని స్వరూపం. ఈ సృష్టిలో అత్యంత బలమైనది కాలమే. కాలానికి సమస్త జీవరాశీ వశపడవలసిందే. కాలానికి లొంగకుండా బతకగలిగినది ఈ సృష్టిలో ఏదీ లేదు. అందుకే శ్రీ మద్ రామాయణంలో కాలం గురించి చెబుతూ...' కాలోహి దురతి క్రమః' అంటారు మహర్షి. అంటే ..కాలాన్ని దాటడం, తనకు వశం చేసుకోవడం, దాన్ని కదలకుండా చేయగలగడం...లోకంలోఎవరికీ సాధ్య పడదు?అని. సాధారణ సిద్దాంతంలో అందరూ కాలానికి వశపడవలసిందే.కాలంలో పుడతారు, కాలంలో పెరుగుతారు, కాలంలోనే శరీరాన్ని విడిచి పెడతారు. అందరూ కాలానికి వశపడి ఉంటారు. కానీ ఎవడు భగవంతుడిచ్చిన జీవితం అనబడే ఈ శరీరంతో ఉండగలిగిన కాలాన్ని సద్వినియోగం చేసుకుంటాడో వాడు తన శరీరాన్ని విడిచి పెట్టేసిన తరువాత కూడా కీర్తి శరీరుడిగా నిలబడిపోతాడు. ఆయనకి కీర్తే శరీరం అవుతుంది. ఆయన కాలంతో సంబంధం లేకుండా యుగాలు దాటిపోయినా కూడా కొన్ని కోట్ల మందికి ప్రేరణగా అలా నిలబడిపోతాడు. అందుకే మనుష్యుని జీవితంలో అన్నిటికన్నా అత్యంత ప్రధానమైనదిగా చెప్పబడేది ? కాలం విలువను గుర్తించడం. ఆ కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం. ఎవడు కాలం విలువని గుర్తించలేడో ఎవడు కాలాన్ని సద్వినియోగం చేసుకోలేడో వాడు కాలగర్భంలో కలిసిపోతాడు. ఆ జీవితం ఏ విధంగా కూడా ఉపయోగకరం కాదు. తనను తాను ఉద్ధరించుకోవడానికిగానీ, మరొకరిని ఉద్ధరించడానికిగానీ పనికిరాడు.

## ఆషాడభూతి

పూర్వం ఒక ఊళ్ళో శివశర్మ అనే పండితుడు ఉండేవాడు. ఆ పండితుడు రెండుమూడు రోజులు ఒక్కో ఊళ్ళో ప్రవచనాలు చెప్పి ఆవూరి వాళ్ళు ఇచ్చిన తినుబండారాలు, డబ్బులు,బంగారం అన్ని తీసుకునేది.అయ్యో నేను కొంప గూడు లేని వాణ్ణి నాకెందుకు ఇవన్నీ అంటూనే చక్కగ తీసుకొని తినేవి తినగ మిగిలినవి అక్కడ వాళ్ళకి పంచి డబ్బు,బంగారం చక్కగ ఒక మూట కట్టుకుని ఆ మూటను రాత్రి తలకింద ఉంచుకుని నిద్రించేది.
ఆ డబ్బుని రోజూ రాత్రి లెక్కించుకునేది. ఎంతో సంతోషపడేది.అలా ఓ ఊళ్ళో ప్రవచనం ఐ పోయాక రాత్రి తిని నిద్రించే ముందు యధా ప్రకారం డబ్బు లెక్క పెడుతుండగా చాటుగా ఒక వ్యక్తి గమనించాడు.ఎట్లాగైనా ఆ డబ్బు బంగారం దొంగిలించాలి అని గట్టిగా నిశ్చయించుకున్నాడు.
తెల్లారి ఒక సన్యాసిలా వేషం వేసుకొని శివశర్మ దగ్గరికి వచ్చి నమస్కారం చేసి అయ్యా నా పేరు ఆషాడ భూతి.నేను మీ ప్రవచనాలు ఎన్నో రోజులుగా వింటున్న. మీరు చెప్పే ప్రతి మాట అక్షర సత్యం.నాకు మీ మాటలు విని ఈ భవబంధాల మీద ఆసక్తి పూర్తిగా పోయింది.దయచేసి మీరు నన్ను మీ శిష్యునిగా స్వీకరించండి.మీ సేవ చేస్తూ మిమ్మల్ని అంటిపెట్టుకొని ఉంటాను. ఇకమీద మీరే నా తల్లి దండ్రి బంధువు గురువు అన్నీ అని శివశర్మ కాళ్ళ పై పడి కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.
అట్లా గురువుగారికి నమ్మకంగా ఉంటూ ఎటు వెళితే అటు వెంట పోతూ గురువుగారికి వచ్చిన ఫలములు ఆహారము తింటూ రాత్రిపూట ఏదో ఒక గుడిలో లేదా సత్రములో ఉంటున్నారు.



ఒకరోజు ఒక ఊరినుండి ఇంకో ఊరికి వెళుతూ ఉండగా శిష్యుడు హఠాత్తుగా ఆగి గురువుగారూ పెద్ద తప్పు జరిగి పోయింది అని అరిచాడు.ఏమ్ జరిగింది నాయనా అన్న గురువుగారికి అయ్యా రాత్రి మనం నిద్రించిన గుడిసె పైకప్పు లోని గరిక పోచలు మన బట్టలకి అంటుకొని వచ్చినాయి. పరుల సొమ్ము పాము వంటిది.మీరు ఇక్కడే ఆగండి.నేను వెంటనే వెళ్ళి వారికి ఆ గడ్డిపరకలు ఇచ్చి వస్తాను అన్నాడు.శిష్యుడి ప్రవర్తన గురువుగారిని పూర్తిగా నమ్మేట్టు చేసింది.కొద్దిదూరం వెళ్లిన శిష్యుడు తిరిగి వచ్చి గురువుగారితో మళ్ళీ నడక సాగించాడు.ఈ లోపు మధ్యాన్నము కావడంతో తినడానికి సమీపంలో ఉన్న చెరువులో దిగి కాళ్ళు చేతులు కడుగుకుందాం అన్న గురువు గారితో ముందు మీరు వెళ్లి రండి మీ మూట నా దగ్గర ఉంచి తర్వాత నేను కాళ్ళు చేతులు కడుగుకొని వస్తాను అన్న శిష్యుడిని పూర్తిగా నమ్మిన గురువు మూట నీ శిష్యుడి కి ఇచ్చి చెరువులోకి దిగగానే ఆ మూట తో శిష్యుడు పారి పోయాడు.
అప్పటినుంచి శిష్యులు ఎవరన్న అతి తెలివి ప్రదర్శిస్తే ఆషాడభూతి లాంటివాడివేర నువ్వు అనడం మనం వింటుంటాం.

(ఇతిహాసాహల్లోని కథ ఆధారంగా)

భోజన్నగారి అనసూయ
నిజామాబాద్




### కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను సబ్ స్క్రయిబ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

# స్పీకర్ పదవిపై అంతా గుంభనం

### పార్లమెంట్ సమావేశాల ముందే స్పష్టత
### విపక్షాలకు ఇచ్చేందకు సిద్ధంగా లేని బిజెపి

న్యూఢిల్లీ,జూన్15 (ప్రజామంటలు): దేశ ప్రధానిగా మూడవసారి నరేంద్ర మోదీ మొత్తం 72 మంది మంత్రులతో కలసి ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. త్వరలోనే పార్లమెంట్ సమావేశాలు జరుగనున్న వేళ లోక్‌సభ స్పీకర్ ఎవరన్న చర్చ వస్తోంది. మంత్రివర్గ కూర్పు సమయంలో బిజెపి మహిళా ఎంపి పురందేశ్వరి పేరు చర్చకు వచ్చింది. కానీ ఎలాంటి చర్చా జరగడం లేదు. ఇప్పుడు రాజకీయ వర్గాల్లో సర్వత్రా వినిపిస్తున్న ఆసక్తికరమైన ప్రశ్న లోక్‌సభ స్పీకర్ ఎవరన్నదే. మోదీ ప్రభుత్వ ఏర్పాటులో కింగ్ మేకర్‌లుగా ఉన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు,జేడీయూ అధినేత నితీశ్ కుమార్ ఇద్దరూ లోక్‌సభ స్పీకర్ పదవిని ఆశిస్తున్నారంటూ జాతీయ మీడియాలో కథనాలు వెలువడు తున్నాయి. అయితే అత్యంత కీలకమైన ఈ పదవిని ఇతరులకు ఇచ్చేందుకు బీజేపీ ముందుకు రాకపోవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఎన్‌డిఎ హయాంలో వాజ్‌పేయ్ ప్రధానిగా ఉన్న సమయంలో జిఎంసి బాలయోగి స్పీకర్‌గా ఉన్నారు. అయితే అప్పటికీ ఇప్పటికీ రాజకీయాలు మారాయి. ఇప్పుడు ఇతర పార్టీలకు స్పకీర్ పదవి ఇస్తే బిజెపి పట్టు కోల్పోతుందన్న వాదన ఉంది. భారత రాజ్యాంగం ప్రకారం లోక్‌సభ తొలి సమావేశానికి ముందు స్పీకర్ పదవి ఖాళీగా ఉంటుంది. అయితే భారత రాష్ట్రపతి ప్రొటెం-స్పీకర్‌ను నియమిస్తారు. కొత్త ఎంపీల చేత ప్రొటెం స్పీకర్ ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం సభలో సాధారణ మెజారిటీతో లోక్‌సభ స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంటుంది. స్పీకర్ ఎన్నికకు ప్రత్యేక నిబంధనలు ఏవీ లేకపోయినా.. రాజ్యాంగం, పార్లమెంటరీ రూల్స్‌ను దృష్టిలో ఉంచుకొని స్పీకర్ ఎన్నికను నిర్వహించాలి. గత రెండు లోక్‌సభల్లో బీజేపీకి స్పష్టమైన అధికారం ఉండడంతో తొలిసారి సుమిత్రా మహాజన్, ఈతరవాత ఓం బిర్లా సాధారణ మెజారిటీతో ఎన్నికయ్యారు. ఇప్పుడు ప్రభుత్వంలో కీలకంగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ ఇద్దరూ రాజకీయ అనుభవజ్ఞులు. సంకీర్ణ సర్కారు నిర్వహణలో దిట్టలు. రాజకీయ సంక్షోభాల సమయంలో స్పీకర్ పదవి ఎంతటి కీలకమైనదో బాగా అవగాహన ఉన్న నేతలు. సంకీర్ణ ప్రభుత్వాల్లో స్పీకర్ పదవి కీలకమైనదిగా రాజకీయ విశ్లేషకులు చెబుతుంటాయి. ఈ విషయాన్ని



గ్రహించే ఇద్దరూ లోక్‌సభ పదవిని కోరుతున్నారు.
స్పీకర్ విలువపై బాగా అవగాహన కల్పించేలా గత రెండేళ్లుగా పలు రాష్ట్రాల్లో పాలక పక్షంలో తిరుగుబాట్లు వచ్చిన విషయం తెలిసిందే. అంతర్గత తిరుగుబాట్లు పార్టీల్లో చీలికలకు దారితీసిన పరిస్థితులు.. ప్రభుత్వాలు కుప్పకూలిన విషయాలు విదితమే. ఇటువంటి సందర్భాలలో స్పీకర్ పదవి చాలా కీలకంగా మారుతుంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం చట్టం కింద సభ్యులపై అనర్హత వేటు వేసే శక్తిమంతమైన హక్కు సభాపతికి ఉంటుంది. ఈ మేరకు స్పీకర్‌కు సంపూర్ణ అధికారం ఉంటుంది. మరోవైపు తన పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ ప్రయత్నిచ్చిందంటూ గతంలో నితీశ్ కుమార్ ఒకసారి ఆరోపించారు. అటువంటి పరిస్థితుల్లో స్పీకర్ పదవి చక్కటి అస్త్రమని భావిస్తుంటారు. ఈ కారణంగానే కింగ్‌మేకర్‌లుగా టీడీపీ, జేడీయూ పార్టీలు అత్యంత వ్యూహాత్మకంగా లోక్‌సభాపతి స్థానాన్ని ఆశిస్తుండ వచ్చునని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పార్లమెంటరీ వ్యవస్థలో లోక్‌సభ స్పీకర్ పదవి చాలా కీలకమైనది. సభను నడిపే వ్యక్తిగా స్పీకర్ పార్టీలకతీతంగా పారదర్శకంగా వ్యవహరించాలి. ఒక నిర్దిష్ట పార్టీకి చెందిన వ్యక్తే అయినప్పటికీ స్పీకర్‌గా ఎన్నికైన తర్వాత మాత్రం అన్ని పార్టీలను సమానంగా చూడాలి. సభలో అందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలి. నాలుగో లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన తర్వాత కాంగ్రెస్ దిగ్గజం నీలం సంజీవ రెడ్డి పారదర్శకంగా నడుచుకునేందుకుగానూ ఏకంగా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఎవరూ ఈ విధంగా తమ పార్టీలకు రాజీనామా చేయలేదు. అయితే పీఏ సంగ్మా, సోమనాథ్ ఛటర్జీ, మీరా కుమార్ వంటి ఇతర మాజీ స్పీకర్లు అధికారికంగా పార్టీకి రాజీనామా చేయకపోయినప్పటికీ తాము సభకు సంబంధించినవారమని, పార్టీకి చెందిన వ్యక్తులం కాదని తెగేసి చెప్పారు. కాగా 2008లో లోక్‌సభ స్పీకర్ విషయంలో ఆసక్తికరమైన పరిణామాం జరిగింది. యూపీఏ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం సందర్భంగా పార్టీ సూచనలను పట్టించుకోలేదనే కారణంగా నాటి స్పీకర్ సోమనాథ్ ఛటర్జీని సీపీఎం పార్టీ నుంచి బహిష్కరించింది. ఈ క్రమంలో స్పీకర్ పదవి అవకాశం వచ్చినప్పుడు బలంగా ఉంటుంది. అందుకే సంకీర్ణ సమయాల్లో ఇది చాలా ముఖ్యం. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొత్తగా ఎన్నికైన లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక కోసం పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమవుతుంది. ఈ ప్రత్యేక సమావేశాలు జూన్ 24న ప్రారంభమై జులై 3న ముగుస్తున్నాయి. తొలి రెండు రోజులు కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారంతోనే సరిపోతుంది. మొత్తం 543 మంది సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. సభలో సీనియర్ సభ్యుడిని రాష్ట్రపతి ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తారు. 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల్లో మధ్యప్రదేశ్‌లోని తికంగఢ్ స్థానం నుంచి బీజేపీ తరఫున గెలుపొందిన వీరేంద్ర కుమార్, కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీ కొడిక్కున్నిల్ సునీల్ సీనియర్ సభ్యులుగా ఉన్నారు. ఇద్దరూ 8 పర్యాయాలు లోక్‌సభకు గెలుపొందారు. అయితే వీరిలో వీరేంద్ర కుమార్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకున్నందున కాంగ్రెస్ సభ్యుణ్ణి ప్రొటెం స్పీకర్‌గా తీసుకుంటారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నికల జరగనుంది. ఈ పదవి కోసం రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీగా ఉన్న దగ్గుబాటి పురందేశ్వరి పేరు రేసులో వినిపిస్తోంది. కేంద్ర మంత్రివర్గంలో ఆమెకు చోటు కల్పించలేదు కాబట్టి 'నారీశక్తి' నినాదంలో భాగంగా ఆమెకు స్పీకర్ పదవి కట్టబెట్టే అవకాశం ఉందన్న విశ్లేషణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే అనూహ్య నిర్ణయాలు తీసుకునే మోదీ-షా ద్వయం ఈసారి స్పీకర్‌గా ఎవరికి అవకాశం కల్పిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## ప్రభుత్వ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

**ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి డిమాండ్**




జగిత్యాల జూన్ 15 (ప్రజామంటలు): అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి డిఇఓ జగన్మోహన్ కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు అనేక రకమైన సమస్యలతో నడుస్తున్నాయి. ఫీజులు చెల్లించలేని పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించాలంటే కనీస మౌలిక సదుపాయాలు విద్యార్థులకు సరిపడా టీచర్లు గదులు మూత్రశాలలు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.

తక్షణమే ప్రభుత్వం స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయుటకు మెగా డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలి అలాగే అటెండర్, స్కావెంజర్ స్లీపర్ వంటి పోస్టులను భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ గా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరిస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జగిత్యాల జిల్లా కార్యదర్శి అక్రమ్ ఉపాధ్యక్షులు మేకల సంజయ్ జిల్లా సహాయ కార్యదర్శి నాగరాజు రాహుల్ జగిత్యాల రూరర్ అధ్యక్ష కార్యదర్శులు మచ్చ నితిన్, తోట రాజేష్, నాయకులు తరుణ్, సతీష్ ప్రేమ్, శ్రీనివాస్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాల మోత

# తల్లిదండ్రులకు ఫీజుల వాత

### కేయూ జేఏసి నేత అన్నం ప్రవీణ్



జమ్మికుంట జూన్ 15 (ప్రజామంటలు): ప్రభుత్వ నిబంధనలను జీవోలను పెడచెవిన పెడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు నిర్లక్ష్య వైఖరితో విద్యార్థులను తల్లిదండ్రులను తీరని నష్టానికి గురి చేస్తున్నాయి.,

ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యా కమిటీ సమక్షంలో ఫీజులను నిర్ణయించాలి తప్ప, లాభార్జనే ధ్యేయంగా, వారి ఇష్టారాజ్యంగా ఫీజులు నిర్ణయించుకొని తల్లిదండ్రుల పాలిట శాపంగా మారాయి ఈ ప్రైవేట్ విద్యా సంస్థలు. ప్రభుత్వ అనుమతి లేకుండా పెద్ద పెద్ద అక్షరాలతో రంగురంగుల డిజైన్లతో మైమరచిపోయే అబద్ధాలతో సీబీఎస్ఈ, ఐఐటి, మెడికల్, ఫౌండేషన్ కరికులం అంటూ ప్రచారాలు నిర్వహిస్తూ విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షింపజేస్తూ వారి పాఠశాలలో చేర్చుకొని కనీస ప్రమాణాలు పాటించకుండా అర్హత లేని సిబ్బందిచే బోధిస్తూ నాణ్యతలేని విద్యను విద్యార్థులకు అందిస్తూ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు. మార్కెట్లో 500 నుంచి 1000 రూపాయలు విలువచేసే పాఠ్యపుస్తకాలను 5, 000 ల నుంచి 10, 000 ల వరకు అమ్ముతూ ఆ పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అంటగట్టేందుకు సిద్ధమైన ప్రైవేటు విద్యాసంస్థలు బుక్ స్టాల్ లతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని విద్యార్థులకు నష్టం చేసే ప్రయత్నాన్ని వెంటనే ఆపాలన్నారు.ప్రైవేట్ విద్యాసంస్థలకు ఫీజుల మీద ఉన్న ధ్యాస పాఠ్య పుస్తకాల ద్వారా అక్రమంగా అధిక డబ్బులకు అమ్ముకుంటున్న దానిమీద ఉన్న సోయి విద్యార్థులకు అందించే నాణ్యమైన విద్య పట్ల వారికి అందించే మౌలిక సదుపాయాల పట్ల ఎందుకు బాధ్యత లేదని అన్నం ప్రవీణ్ ప్రైవేట్ విద్యాసంస్థలను ప్రశ్నించారు. కాలం చెల్లిన పాఠశాల వ్యాన్లను ఉపయోగిస్తూ అనుభవం లేని డ్రైవర్లను నియమించి ఆ వ్యాన్లలో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని అన్నం ప్రవీణ్ తెలిపారు. విద్యా హక్కు చట్టాన్ని ప్రైవేటు విద్యాసంస్థలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థులకు అందించాల్సినటువంటి ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, వికలాంగులు, హెచ్ఐవి, బాధిత వర్గాల విద్యార్థులకు 25 శాతం పాఠశాల కోటాలో ఉచిత విద్యను అందించాల్సి ఉన్న ఎందుకు అందించడం లేదని తక్షణమే దానిమీద వివరణ ఇవ్వాలని అడిగారు. కాకతీయ యూనివర్సిటీ లా విద్యార్థిగా తెలంగాణ ఉద్యమకారునిగా విద్యాశాఖ అధికారులకు సూచిస్తున్నా, ఈ అంశాల పట్ల వెంటనే స్పందించాల్సిన వంటి అవసరం ఉందనీ అన్నం ప్రవీణ్ న్యాయబద్ధంగా కోరారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన నిర్లక్ష్యం ఇప్పుడు చేస్తే ఊరుకోమని అన్నం ప్రవీణ్ హెచ్చరించారు. ప్రభుత్వ జీవోలను పాటించేలా ప్రభుత్వ నిబంధనలను ఆచరించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిబంధనల పట్ల జీవోల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నటువంటి విద్యాసంస్థలపై వెంటనే గుర్తింపు రద్దు చేసే శాఖపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యాధికారులను అన్నం ప్రవీణ్ కోరారు.వెంటనే ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్నటువంటి ప్రైవేటు పాఠశాలల మీద చర్యలు తీసుకోకపోతే తదుపరి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు అన్నం ప్రవీణ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ లా విద్యార్థి అన్నం ప్రవీణ్ తో పాటు బిజిగిరి శ్రీకాంత్, గైకోటి రాజు, బుడిగే శ్రీకాంత్, కారింగుల రాజేందర్, పచ్చిమట్ల భాను, దిలీప్, పోతరాజు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నేత ఎగ్గెటి హరీష్

జమ్మికుంట జూన్ 15 (ప్రజామంటలు): జమ్మికుంట మండలం మడిపెల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు ఎగ్గెటి హరీష్ శనివారం ఢిల్లీ లోని కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని ఆయన కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానం చేసారు. ఇటీవల కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కరీంనగర్ కు చెందిన తనలాంటి సామాన్య కార్యకర్తను కేంద్ర కార్యాలయం కలవడానికి అవకాశం కల్పించినందుకు హరీష్ హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.బీజేపీ కార్యకర్తల యొక్క అంకితబావాన్ని గుర్తించి తన గెలుపు కోసం శ్రమించిన కార్యకర్తల అవకాశం ఇవ్వడం అనేది ఒక్క సంజయ్ లాంటి నాయకునికి అలాగే బీజేపీ పార్టీ నాయకత్వానికే సాధ్యమని హరీష్ సంతోషం వ్యక్తం చేశారు.



## ధర్మపురి స్వామి వారిని దర్శించుకున్న భక్తులు



జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15 (ప్రజామంటలు): జ్యేష్ఠ శుద్ధ నవమి శనివారం సందర్భంగా జగిత్యాల జిల్లా ధర్మపురి పుణ్యక్షేత్రంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానమునకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ముందుగా గోదావరి నదిలో పుణ్య స్నానం ఆచరించిన తదుపరి స్థానిక దైవమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని అలాగే అనుభంద దేవాలయములలో గల శ్రీ ఉగ్ర నరసింహ స్వామి, శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీ వేణుగోపాల స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామివార్లను అదిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

## జగిత్యాల జిల్లా కలెక్టర్ గా బి సత్యప్రసాద్ నియామకం



జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కలెక్టర్ గా బుధుమజ్జి సత్య ప్రసాద్ నియామకం. ఇక్కడ పని చేస్తున్న కలెక్టర్ యస్మిన్ భాష బదిలీ అయ్యారు. ఖమ్మంలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడిగా పనిచేస్తున్న సత్య ప్రసాద్ పదోన్నతిపై జగిత్యాల కలెక్టర్ గా నియామకం అయ్యారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేసిన ఎంఈవో జమునదేవి



గొల్లపల్లి జూన్ 15 (ప్రజామంటలు): మండలంలోని భీంరాజ్‌పల్లి గ్రామంలో భీంరాజ్‌పల్లి బొమ్మెన కుమార్ (బీబీకే) ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఎంఈవో జమునదేవి చేతుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 1%–%5వ తరగతి విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్సిల్స్, స్లేట్స్, మధ్యాహ్న భోజన పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం మూతపడిన పాఠశాలలను సైతం ప్రారంభించిందని, ప్రతి ఒక్కరు పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు నోట్‌బుక్‌లు, మధ్యాహ్న భోజన సామాగ్రిని అందజేసిన బొమ్మెన కుమార్‌ను అభినందించారు. అలాగే ప్రభుత్వం తరుపున విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీబీకే నిర్వాహకులు బొమ్మెన కుమార్, ఉపాధ్యాయులు రజిత, శ్యామల, సింగారపు లచ్చయ్య, సింగారపు మహేశ్, కొలగాని గంగచారి, నర్సయ్య, కొలగాని ఎర్రయ్య పాల్గొన్నారు.

## గాంధీలో ట్రీట్మెంట్ పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్ జూన్ 15 ( ప్రజామంటలు): గాంధీ ఆసుపత్రిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇది. చిలకలగూడ ఎస్ఐ కిషోర్ కథనం ప్రకారం..ఈనెల 12న గాంధీ ఆసుపత్రి ఎదురుగా అనారోగ్యంతో అపస్మారక స్థితిలో పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి (50) ని గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ఆసుపత్రిలో చేర్పించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ట్రీట్మెంట్ పొందుతూ సదరు వ్యక్తి శనివారం మృతి చెందగా, ఇతనికి సంబందించిన వారు ఎవరూ లేకపోవడంతో పాటు వివరాలు తెలియకపోవడంతో డెడ్ బాడీని మార్చురీకి తరలించి, భద్రపరిచారు. కేసు నమోదు చేసుకున్న చిలకలగూడ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తు పట్టిన వారు తమకు వివరాలు తెలపాలని ఎస్.ఐ. విజ్ఞప్తి చేశారు.

# రెండు నెలలుగా పనిచేయని పవర్ బోర్

### నిరుపయోగంగా మినీ వాటర్ ట్యాంక్

### భోలక్ పూర్ వాసుల నీటి కష్టాలు



సికింద్రాబాద్, జూన్ 15 (ప్రజామంటలు): బన్సీలాల్ పేట డివిజన్ న్యూ భోలక్ పూర్ హనుమాన్ ఆలయం సమీపంలో ఉన్న పవర్ బోర్ కు సంబంధించిన మినీ వాటర్ ట్యాంక్ నిరుపయోగంగా పడి ఉంది. దాంతో స్థానికులు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు నెలల క్రితం స్థానిక వాల్మీకి స్మశాన వాటికలో సంభవించిన అగ్నిప్రమాదంలో పవర్ బోర్ కరెంటు తీగలు కాలిపోవడంతో అప్పటినుంచి వాటర్ సప్లై లేదు. దాంతో అప్పటి నుంచి నీటి వసతి లేక నానా ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బల్దియా వాటర్ కూడ సక్రమంగా రావడం లేదన్నారు. ఇప్పటికైనా వాటర్ వర్క్స్ అధికారులు స్పందించి కొత్త సర్వీస్ వైర్ బిగించి, పవర్ బోర్ ను పునరుద్దరించి, వాటర్ ట్యాంకును ఉపయోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

## కురుక్షేత్రంలోని అమ్మవారి సన్నిధిలో బీజేపీ నేతల పూజలు

### ఘనంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి జన్మదిన వేడుకలు

సికింద్రాబాద్ జూన్ 15 (ప్రజామంటలు): కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ కు చెందిన బీజేపీ నాయకులు శనివారం కురుక్షేత్రంలోని భద్రకాళీ శక్తి పీఠంలోని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాభిమానంతో మంత్రి కిషన్ రెడ్డి భవిష్యత్ లో మరిన్ని పదవులు అధిష్టించాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని వారు అమ్మవారిని వేడుకున్నారు. పూజ కార్యక్రమాల్లో సికింద్రాబాద్ బీజేపీ నాయకులు పి. రవి ప్రసాద్ గౌడ్, హరి, ప్రభుగుప్తా, దత్తు, అంబాల రాజేశ్వర్ రావు, మధుల శ్యాంసుందర్, ఆకుల సంపత్, వినయ్, సురేశ్, కిషోర్ లు పాల్గొన్నారు.





## రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం ఎదుట ధర్నాకు దరఖాస్తు

**డబల్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలలో నాణ్యతా లోపం - నిబంధనలకు విరుద్ధంగా పనులు**

**ఎన్ని పిర్యాదులు చేసినా పట్టించుకోని అధికారులు - మరోసారి అదనపు కలెక్టర్ కు ఫిర్యాదులు**

బుగ్గారం జూన్ 15 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యం. శ్రీనివాస్ ను శనివారం బుగ్గారం మండల అభివృద్ధి కమిటి కన్వీనర్ చుక్క గంగారెడ్డి కోరారు. బుగ్గారం లో నూతనంగా నిర్మించిన డబల్ రోడ్డు పనులు, రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా, పూర్తి నాణ్యతా లోపంతో జరిగాయని ఆయన ఆరోపించారు. గత ఏడాది కాలం నుండి అనేక పర్యాయాలు పిర్యాదులు చేశామని తెలిపారు. ఎన్నో సార్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినా రోడ్లు, భవనాల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

శనివారం ఆయన పలువురు గ్రామస్తులతో కలిసి మరోసారి జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు కు డబల్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాల లోపం పై వేర్వేరుగా పిర్యాదులు చేశారు. సంబంధిత కాంట్రాక్టర్ల బిల్లులు నిలిపి వేసి తగు విచారణ జరిపి లోపాలపై తగు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వీటివల్ల నష్ట పోయిన ప్రజలకు తగు నష్ట పరిహారం చెల్లించాలని ఆయన కోరారు. రోడ్లు, భవనాల శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే బుగ్గారం ప్రజలకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లిందని ఆయన వివరించారు. అట్టి నష్టాన్ని నేరుగా ప్రజలకు సంబంధిత కాంటాక్టర్ ల నుండి ఇప్పించి, నాణ్యత లేని డబల్ రోడ్డు, డ్రైనేజీలు తొలగించి, నాణ్యత తో పున: నిర్మాణం చేయాలని ఆయన కోరారు. లేని పక్షంలో రోడ్లు - భవనాల శాఖ కార్యాలయం ఎదుట నష్టపోయిన బుగ్గారం ప్రజలతో శాంతియుతంగా ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. అందుకే స్వయంగా రోడ్లు , భవనాల శాఖ జగిత్యాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అధికారి యం.శ్రీనివాస్ ను కలిసి శాంతియుతంగా నిర్వహించే మా నిరసన - ధర్నాకు అనుమతి ఇవ్వాలని కోరడం జరిగిందని అన్నారు. చుక్క గంగారెడ్డి వెంట గ్రామ అభివృద్ధి కమిటి యొక్క కోర్ కమిటీ కో-చైర్మన్ పెద్దనవేని రాగన్న, పరుమాల సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

### జిల్లా సంక్షేమ అధికారి బి. వాణిశ్రీ

**ఘనంగా 12వ ప్రపంచ వయోధికులపై వేధింపుల నివారణకు అవగాహన దినోత్సవం**



జగిత్యాల జూన్ 15 (ప్రజామంటలు): వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని,జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష ఆధ్వర్యంలో చట్టం పకడ్బందీగా అమలవుతున్నదని జిల్లా సంక్షేమ అధికారి బి. వాణిశ్రీ అన్నారు.శనివారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అసోసియేషన్ కార్యాలయంలో 12 వ ప్రపంచ వయోధికులపై వేధింపుల నివారణకు అవగాహన దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటీజేన్స్ సంక్షేమ చట్టం, పిలుపు మాస పత్రికలను జిల్లా సంక్షేమ అధికారి వాణిశ్రీ, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ లు ఆవిష్కరించారు. 16 మంది విశిష్ట వయో వృద్ధులను, ఆరుగురు ఉత్తమ కూతుర్లను, ఆరుగురు ఉత్తమ కుమారులను సన్మానించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వయో వృద్ధుల కోసం భవన నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. డివిజన్ ట్రిబ్యునల్ చైర్మన్, ఆర్డీవో పి. మధు సూదన్ మాట్లాడుతూ.... వయో వృద్ధులను వేధిస్తే చట్ట ప్రకారము చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులను నిరాదరణకు గురి చేస్తే 3 నెలలకు పైగా జైలుశిక్ష తోపాటు జరిమానా విధించే వీలుందన్నారు. సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు వయోధికుల చట్టం పై అవగాహన సదస్సులు, కౌన్సిలింగ్ లు నిర్వహిస్తుండడంను అభినందించారు. సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ.... వయోధికుల కోసం జిల్లా, డివిజన్, మండల కేంద్రాల్లో డే కేర్ సెంటర్ల ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష ఆధ్వర్యంలో వయోధికుల కేసుల పరిష్కారంలో ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్ లు రాష్ట్రంలో నెంబర్ వన్ గా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటీజేన్స్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్,జిల్లా కౌన్సెలింగ్ అధికారి పి. హన్మంత రెడ్డి, కోశాధికారి వెలముల ప్రకాష్ రావు, ఉపాధ్యక్షుడు ఎం.డి. యాకూబ్, సఖి కౌన్సిలర్ శారద, ఐసిఐసి బ్యాంకు మేనేజర్ ఆలేఖ్య, సీనియర్ జర్నలిస్టు మహేష్, ఉమ్మడి జిల్లా విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు దోనూరి భూమాచారి, వివిధ సంఘాల ప్రతినిధులు రాజ్ గోపాల్ చారి, సింగం గంగాధర్, నలువాల హన్మాండ్లు, రామ్ చంద్రం, సింగం భాస్కర్, గంగం జలజ, పద్మ, దేవేంద్రమ్మ, బోబ్బాటి కరుణ, జిల్లా, డివిజన్,మండలాల సీనియర్ సిటీజేన్స్, పెన్షనర్ల, వివిధ యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో ఏకరూప దుస్తులు, నోటుబుక్స్, పాఠ్య పుస్తకాల పంపిణీ





గొల్లపెల్లి జూన్ 15 (ప్రజామంటలు): ఆదర్శ పాఠశాల గొల్లపల్లి యందు ఏకరూప దుస్తులు పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కోల సంధ్య ,పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేని రాజ్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.ప్రభుత్వం చేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, ఏకరూప దుస్తులను వినియోగించుకొని పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని ప్రిన్సిపల్ ఈరవెని రాజ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ తో పాటు వైస్ ప్రిన్సిపాల్ కె. నగేష్, పాఠశాల గ్రంధాలయ బాధ్యులు హరిప్రియ, ఉపాధ్యాయుల సతీష్, మురళీధర్, అన్నపూర్ణ, పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయురాలు రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగిత్యాల నియోజకవర్గానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఎన్ని కంపెనీలు తీసుకువచ్చారు??



## ఎంతమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారు?

## ఇంటర్నేషనల్ కంపెనీలు ఎందుకు జగిత్యాలకు రావడం లేదు?

జగిత్యాల జూన్ 15 (ప్రజామంటలు):

నియోజకవర్గంలో 4520 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు సాంక్షన్ అయ్యి నిరుపయోగంగా వుంటే వాటి గురించి పట్టించుకోకుండా కేవలం వారికి కావలసిన వర్గానికి కావాల్సిన వారి కోసమే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ పాకులాడుతున్నారు. ఎమ్మెల్సీ మరియు ఎమ్మెల్యే ఇద్దరు నాయకులను సూటిగా ప్రశ్నిస్తున్న జగిత్యాలకు మీరిద్దరూ కలిసి ఎన్ని కంపెనీలు తీసుకొచ్చారు. ఎంతమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించారు. ఎన్ని ఇంటర్నేషనల్ కంపెనీలు జగిత్యాలకు తీసుకువచ్చారు శ్వేత పత్రం విడుదల చేయగలరా? బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల్ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ బోగ శ్రావణి మాట్లాడుతూ....జీవన్ రెడ్డి 4వ వార్డ్ లో ఒక ఇంటి నిర్మాణాన్ని అక్రమ కట్టడం అని కలెక్టర్ కి కంప్లైంట్ ఇచ్చారు. మరి అదే వార్డులో అదే ఇంటి ముందు ఇంకో ఇల్లు కట్టడం జరుగుతుంది. మరి దానిపై మీరు ఎందుకు స్పందించలేదు?

**ఒక వర్గానికి చెందిన వారిపై ప్రేమ?**

అక్రమ కట్టడంపై వార్డులో ఒక వ్యక్తికి నోటీసులు వచ్చినప్పుడు అదే ఇంటి ముందు జరుగుతున్న ఇంకో అక్రమ కట్టడానికి ఎందుకు నోటీసులు ఇవ్వడం లేదు? ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అక్రమ కట్టడాలు ఎవరు కట్టిన చర్యలు తీసుకోవాలి కేవలం మీ

**అనుచరుడిని వెనుక వేసుకుని వస్తే ఎలా**

నచ్చితే సక్రమం నచ్చకపోతే అక్రమం అనేది ఎమ్మెల్యే మీకు వర్తిస్తుంది. ఈ మాటలు చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంది. ఒక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ హోదాలో ఉండి మీరు ఈ అక్రమ కట్టడాలను ఎంకరేజ్ చేస్తున్నట్టే కదా? ఒక అక్రమ కట్టడం గురించి ఒక ఎమ్మెల్యే ఒక ఎమ్మెల్సీ స్థాయి వ్యక్తులు ఇలా మాట్లాడడం జగిత్యాల ప్రజలు విడ్డురంగా చుస్తునారు. జగిత్యాలకు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన 4,520 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిస్థితి ఏంటి? వాటికి కనీస వసతులు కూడా లేవు కరెంట్, రోడ్లు,డ్రైనేజీ మరియు తాగునీటి వ్యవస్థ సరిగ్గా లేదు కరెంటు మీటర్లు రాక చెప్పులు అరిగేలా కరెంట్ ఆఫీస్ చుట్టూ తిరుగుతున్నారు కనీసం పట్టించుకునే నాయకుడు లేడు కనీసం నీటి వసతి కూడా అక్కడ సరిగ్గా లేదు కేవలం మున్సిపల్ వాటర్ ట్యాంక్ వచ్చి పోస్తే తప్ప వారికి నీళ్లు లేవు వారి గురించి మీరు ఎవరైనా మాట్లాడారా?

**ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లు దీనికి సమాధానం చెప్పండి...?**

జీవన్ రెడ్డి మీ ప్రభుత్వం అధికారంలో ఉంది డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గురించి ఒక్కసారి అన్న సీఎం ని అడిగారా రిప్రజెంటేషన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. 6 గ్యారంటీల అమలు ఏమైంది నియోజకవర్గ సమస్యలపై స్పందించండి అన్నారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న తెలుగు పుస్తకలలో ముందు మాటలో కెసిఆర్ పేరు వుంది అలా అని వెనక్కు తీసుకోవడం ఏంటి అన్నారు.

ఆంధ్రప్రదేశ్ లో పాత సిఎం ఫొటో వుంటే అవే పంచండి, ప్రభుత్వ సొమ్ము వేస్ట్ చేయకండి అని ఎన్డిఏ భాగస్వామ్య సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 700 కోట్లతో కోకో కోలా కంపెనీ పక్కన ఉన్న పెద్దపెల్లి జిల్లాకు అక్కడ మంత్రి తీసుకువెళ్తే మీరు ఏం చేస్తున్నారు? జగిత్యాల జిల్లాకు అన్ని హంగులు ఉండి ముఖ్యంగా ముడి సరుకు అయిన అతి పెద్ద మ్యాంగో మార్కెట్ జగిత్యాలో ఉంది, అదే కంపెనీ జగిత్యాలకు వస్తే సుమారు 2,000 మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన వారు అవుతారు. రైతులకు మేలు చేసిన వారు అవుతారు.

**ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఇది మీ ఎన్నికల హామీ మీరు మర్చిపోయారా?**

జీవన్ రెడ్డి మీ ప్రభుత్వంలో ఉండి మీరు జగిత్యాలకు ఏం చేస్తున్నారు? ఏ కంపెనీ ఎందుకు రాలేదు జగిత్యాలకు. ఎమ్మెల్యే, ఏంఎల్సీ లు జగిత్యాల కు ఎన్ని ఉద్యోగాలు తీస్కోచ్చారు శ్వేత పత్రం విడుదల చేస్తారా? అని డాక్టర్ బోగ శ్రావణి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రూరల్ మండల అధ్యక్షుడు నలువాల తిరుపతి, జగిత్యాల పట్టణ ప్రధాన కార్యదర్శిలు ఆముదరాజు, సిరికొండ రాజన్న, మాజీ పట్టణ అధ్యక్షులు వీరభత్తిని అనిల్ కుమార్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొక్కు గంగాధర్, జగిత్యాల్ పట్టణ ఇన్చార్జ్ మ్యాదరి అశోక్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు దురిశెట్టి మమత, పట్టణ ఉపాధ్యక్షులు గాదాసు రాజేందర్, మల్లేశ్వరి సింగం పద్మ మరియు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తాం ఇంపాక్ట్ ట్రైనర్ బెల్లి జనార్ధన్



సికింద్రాబాద్ జూన్ 15 (ప్రజామంటలు):

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ వ్యవస్థాపకుడు గంపా నాగేశ్వర్ రావు పర్యవేక్షణలో, డాక్టర్ ఆదినారాయణ రెడ్డి (పీహెచ్డీ) ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో 'ట్రైన్ ది ట్రైనర్ వర్కుషాప్-154 బ్యాచ్' 30 రోజులు ఆన్ లైన్ సెషన్ మరియు 2 రోజులు ఆఫ్ లైన్ సెషన్ సికింద్రాబాద్ మినర్వ గ్రాండ్ హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయవంతంగా ట్రైనింగ్ పూర్తి చేసి, అటెండెన్స్, అసైన్మెంట్స్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిందుకు సినీ నటుడు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు కె.వి. ప్రదీప్, ఇంపాక్ట్ జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ సోను, ఉపాధ్యక్షుడు డాక్టర్ అది చేతుల మీదుగా ప్రముఖ సినీ నిర్మాత, రిటైర్డ్ ఆర్మీ అధికారి బెల్లి జనార్ధన్ యాదవ్ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా ఎన్నో విషయాలను నేర్చుకోవడం జరిగిందని అన్నారు. తాము తెలుసుకున్న విషయాలను ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచేటట్లు, వారు మానసికంగా ఒత్తిడికి లోను కాకుండా చదువులో అభివృద్ధి చెందేటట్లు అవేర్నెస్ కల్పిస్తామన్నారు. వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, వారు భవిష్యత్తులో ఏది సాధించాలని అనుకుంటున్నారో దానిపై అవగాహన కల్పించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ద్వారా తమ వంతు కృషి చేస్తానని బెల్లి జనార్ధన్ తెలిపారు. ఈ విజయానికి సహకారం అందించినటువంటి ఇంపాక్ట్ ఫౌండేషన్ 'ఆదిగురు టీం' డైరెక్టర్ ఇంటూరి భాస్కర్ రావు, ఇన్చార్జీలు తలారి చక్రవర్తి, తుళ్లూరి రవీంద్ర బాబు, కో-ఆర్డినేటర్స్ నారగోని శ్రీనివాస్, పాలకుర్తి విజయలక్ష్మి ధన్యవాదాలు తెలియజేశారు.

## రోడ్డు పై దొరికిన 23,100 రూపాయలు

### ట్రాఫిక్ పోలీసులకు అందజేసిన ఆటో డ్రైవర్స్ గడ్డం శ్రీనివాస్, ఎం.డి. రిజ్వాన్



జగిత్యాల జూన్ 15 (ప్రజామంటలు):

జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం 4 గంటల సమయంలో పాత బస్టాండ్ సమీపంలో బైక్ పై వెళ్తున్న లెల్లెల బాలకృష్ణ జేబులోంచి 23,100 రూపాయలు పడిపోవడంతో వెనకాలనే వస్తున్న ఆటో డ్రైవర్లు గడ్డం శ్రీనివాస్, ఎం డి రిజ్వాన్ గమనించి ట్రాఫిక్ పోలీస్ పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్న హెచ్.సి. రాజమౌళి కి అట్టి రూపాయలు అప్పజెప్పారు. బైక్ పై వెళ్లిన వారి వివరాలు తెలుసుకొని వారిని పిలిపించి పోయిన డబ్బులు 23 వేల ఒక వంద రూపాయలను లెల్లెల బాలకృష్ణ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల గడ్డం శ్రీనివాస్, ఎం.డి. రిజ్వాన్, హెడ్ కానిస్టేబుల్ రాజమౌళిని ట్రాఫిక్ ఎస్ఐ రామచంద్రం అభినందించారు.

# ఘనంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

### యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ సజ్జు ఆధ్వర్యంలో



జమ్మికుంట జూన్ 15 (ప్రజామంటలు):

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలోని స్పందన అనాధాశ్రమంలో పేదల రక్షణ కవచం, ఆయనే ఒక ధైర్యం, ఆయనే నమ్మకం, నిజాయితీకి నిలువెత్తు రూపం, అపర చాణక్యుడు, పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో తెలంగాణ ప్రజల సమస్యపై గళమెత్తి, తెలంగాణ ప్రజా పాలనకు దోహదపడిన మన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పుట్టిన రోజు సందర్భంగా జమ్మికుంట కేంద్రంలోని స్పందన అనాదాశ్రమంలో హుజురాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ సజ్జు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు, అంతేకాకుండా కేక్ కటింగ్ చేసి, స్వీట్లు, పండ్లు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో నిండు నూరేళ్లు ఉండాలని ఆయన అన్నారు. ఉపముఖ్యమంత్రి కాకుండా ఇంకా ఉన్నత స్థాయి పదవులు చేకూర్చాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గూడెపు సారంగపాణి, టౌన్ ప్రెసిడెంట్ సుంకరి రమేష్, ఎండి రంజాన్, యాట్ల అశోక్, దొడ్డే నవీన్,సతీష్ రెడ్డి, అశోక్, సంపత్, ఉడుత వెంకటేష్, మహేష్ ,అంజిరెడ్డి, అఫ్రోజ్, రోమాల రాజుకుమార్, మైస సురేష్, ఫయాజ్, సల్లు బాబా, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ కొత్తపేటలో అర్ధరాత్రి రోడ్డుపై గంజాయి తాగుతూ యువకుల వీరంగం

హైదరాబాద్ జూన్ 15 (ప్రజామంటలు):

కొత్తపేటలో అర్ధరాత్రి గంజాయి బ్యాచ్ వీరంగం. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన గంజాయి బ్యాచ్ దాడి ఘటన. అర్ధరాత్రి రోడ్డుపై గంజాయి తాగుతున్న యువకులను అక్కడి నుంచి వెళ్లాలని మందలించిన ఇంటి యజమాని జనార్ధన్. వెళ్ళమన్నాడని ఇంటి యజమాని మీద కర్రలు, రాళ్లతో గంజాయి బ్యాచ్ దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా ఇంటి యజమాని గాయపడినాడు. సరూర్ నగర్ పీఎస్ లో బాధితుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

## కవిత్వం

### తడి లేనికళ్లు

వడి తెలుసు
గుడి తెలుసు
బడి తెలుసు
మడి తెలుసు
తడి తెలుసు
వాడికి అన్నీ తెలుసు
కాడిమోయకుండా
బతకడం తెలుసు
కాని...
అమ్మవడి తెలియదు
గుండె తడి తెలియదు
కళ్లతడి తెలియదు
వాడివి తడి లేని కళ్లు
బాగ బలసిన వళ్లు

రేడియమ్‌జి
9291527757

# ఆదర్శ సంపాదకులు ఖాసా సుబ్బారావు

**జూన్ 16...ఖాసా సుబ్బారావు వర్ధంతి**



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494

గాంధేయవాదానికి, నీతి నియమాలకు నిలువెత్తు దర్పణంగా, బతికిన ప్రముఖ పత్రికా సంపాదకుడు ఖాసా సుబ్బారావు. నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో యాజ్ఞవల్క్య బ్రాహ్మణ (ప్రథమశాఖ) సామాన్య మధ్యతరగతి కుటుంబంలో రామాబాయమ్మ, సుందర రామారావు దంపతులకు 1896, జనవరి 23న జన్మించారు. ఖాసా హైస్కూలు విద్య నెల్లూరులో పూర్తి చేసి మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల నుండి ఫిలాసఫీ ప్రధాన విషయంగా డిగ్రీ పుచ్చుకున్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ మద్రాసు కాలేజీలో వీరికి గురువు. ఈయనపై డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ బోధనల ప్రభావం జీవితాంతం ఉంది. డిగ్రీ పూర్తి అయిన తరువాత న్యాయ శాస్త్రంలో పట్టా సంపాదించారు. కానీ కారణాంతరాల వల్ల న్యాయవాద వృత్తి చేపట్టలేదు.


పూర్వీకులు మహారాష్ట్ర ప్రాంతం నుండి నెల్లూరుకు వలసవచ్చారు. భార్య భవానిబాయి, తల్లి రామాబాయంమ్మ లతో కలిసి నెల్లూరు జిల్లా పల్లిపాడులో గాంధీజీ ప్రారంభించిన పినాకినీ సత్యాగ్రహ ఆశ్రమంలో ఉన్నారు. చతుర్వేదుల వెంకటకృష్ణయ్య, దిగుమర్తి హనుమంతరావు, బుచ్చిక్రిష్ణమ్మ, కొండిపర్తి పున్నయ్య తదితర ఆశ్రమ వాసులతో కలిసి సత్యం, అహింస, బ్రహ్మచర్యం మొదలయిన 11 సూత్రాలను ఆచరిస్తూ, నిర్మాణకార్యక్రమంలో పాల్గొన్నారు.

రాజమండ్రి వెళ్లి ఉపాధ్యాయ శిక్షణ పొందాడు. నెల్లూరు జిల్లా కందుకూరు జిల్లా బోర్డు మాధ్యమిక పాఠశాల ప్రధానోపాధ్యాయ పదవిలో కొంతకాలం పనిచేశాడు. ఈ ఉద్యోగం అతనికి సంతృప్తిని ఇవ్వలేదు. రాత్రి వేళల్లో స్కూలు సమీపంలో ఉన్న 50 మంది వయోజనులకు చదువు చెప్పి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాడు.

స్వాతంత్ర్యోద్యమ క్రమంలో గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమ సందర్భంలో ఖాసా సుబ్బారావు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, సత్యాగ్రహ లక్ష్యాలను ప్రజలకు వివరించడానికి అనేక చోట్ల విస్తృతంగా పర్యటించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఈయన 6 నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించారు. 1931లో మద్రాసు చైనా బజారులో విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో పాల్గొన్నప్పుడు పోలీసు లాఠీ దెబ్బలు తగిలి తీవ్ర రక్తస్రావం జరిగి మూర్ఛ పోయారు. ఈ సంఘటన బ్రిటీష్ పార్లమెంటులో ప్రకంపనలు సృష్టించింది. ఆ సంఘటనపై విచారణ జరిపిన ఏక సభ్య కమిషన్ లార్డ్ లూథియన్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖాసా సుబ్బారావును పరామర్శించి లాఠీచార్జ్ ను తీవ్రంగా ఖండించింది. 1942-44ల మధ్య ఈయన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని 20 నెలల కారాగార వాసం అనుభవించారు.

మద్రాసు ప్రెసిడెన్సీలో నివసించే ఆంధ్రులు వివక్షకు గురయ్యే వారని టంగుటూరి ప్రకాశం భావించి మద్రాసాంధ్రులకు బాసటగా స్వరాజ్య పత్రికను స్థాపించి నడిపారు. ఉపాధ్యాయ వృత్తి తర్వాత 1921లో ఖాసా సుబ్బారావు మద్రాసుకు వెళ్ళి, ఓసారి జాతీయ భావాల ప్రచార కార్యక్రమంలో భాగంగా మద్రాసులోని స్వరాజ్య పత్రిక కార్యాలయానికి వెళ్లినప్పుడు అక్కడ ఉన్న టంగుటూరి ప్రకాశం పంతులు ఖాసా లోని దేశభక్తిని గమనించి తన బదులు స్వరాజ్య పత్రికలో సంపాదకీయం రాయడానికి సుబ్బారావును కోరారు. అది మొదలు సుబ్బారావు పత్రికా లోకంలో తన వైభవాన్ని విశేషంగా చాటు కున్నారు. భాష, భావ వ్యక్తీకరణ, స్పష్టత, నిర్భీతి లాంటి గుణాల వల్ల సుబ్బారావును పాఠక లోకం విశేషంగా అభిమానించింది. అప్పటి నుండి ఖాసాకు పత్రికా రంగంతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది.అలా ఖాసా సుబ్బారావు చివరకు జర్నలిజం లోనే స్థిరపడి పోయారు. ఈ పత్రికకు ప్రకాశం పంతులు మేనేజింగ్ డైరెక్టర్గా, సంపాదకుడిగా వ్యవహరించాడు. కె.ఎం.ఫణిక్కర్ ఇన్‌ఛార్జ్ ఎడిటర్‌గా వ్యవహరించేవారు. ఖాసా సుబ్బారావుతో పాటు ఎస్.ఎన్.వరదాచారి, కోలవెన్ను రామకోటేశ్వర రావు, ఎం.చలపతిరావు మొదలైన వారు ఈ పత్రిక ఉప సంపాదకులుగా వ్యవహరించారు.

జాతీయ భావాలు అధికంగా ఉన్న ఖాసాను ప్రకాశం పంతులు ఏరికోరి తన పత్రిక సంపాదకునిగా నియమించు కున్నారు. రాజాజీతో పాటు పలువురు రాజకీయ ఉద్దండులు ఆయన కలంపోటుకు గురయ్యారు. అయినప్పటికీ అందరూ ఆయన్ను ఎంతో గౌరవించే వారు. అభిమానించే వారు. టంగుటూరి ప్రకాశం ఈ పత్రికలో పనిచేసే కార్మికులకు వేతనాలు చెల్లించలేక పోతే ఖాసా కార్మికుల పక్షాన నిలిచారు. కార్మికులకు వేతనాలు చెల్లించాలని ప్రకాశంకు ఘాటైన లేఖలు వ్రాసేవారు. ఆర్థిక సంక్షోభం వల్ల ఈ పత్రిక మూతబడింది.



1936 వరకు స్వరాజ్యలో పనిచేసిన ఖాసా అనంతరం కోల్‌కతా నుండి వెలువడే ఇండియన్ ఫైనాన్స్, ముంబాయి నుండి వెలువడే ఫ్రీ ప్రెస్ జర్నల్‌లో పని చేశారు. ఆ తరువాత ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జాయింట్ ఎడిటర్‌గా, ఎడిటర్‌గా పనిచేశారు. ఆంధ్రప్రభకు తొలి సంపాదకులు ఆయనే.

స్వతంత్ర భావాలు కలిగిన ఖాసా ఇతర పత్రికలలో ఇమడలేక స్వంతంగా పత్రికను ప్రారంభించారు. తన మిత్రుడు ఉప్పులూరి కాళిదాసు సహకారంతో 1946లో స్వతంత్ర అనే ఆంగ్ల వార పత్రికను ప్రారంభించారు. 1948లో తెలుగు స్వతంత్రను ప్రారంభించారు. ఈ రెండు వార పత్రికలను పదేళ్ల పాటు బలమైన రాజకీయ వార్తా పత్రికలుగా నడిపారు. తెలుగు స్వతంత్రలో చాలా అపురూపమైన సాహిత్యం చోటు చేసుకుంది. ఆ రచనలకు పారితోషికం ఇచ్చే సంప్రదాయం తొలినాళ్ళలో లేకున్నా అప్పటికి ఔత్సాహిక రచయిత అయిన భరాగో ఉత్తరంలో కోరడంతో సరిదిద్దుకుని ఆపైన రచనలకు పారితోషికం ఇచ్చే సంప్రదాయం ప్రారంభించారు. నైతిక విలువలతో నీతినియ మాలతో జీవించిన ఆయన 1961 జూన్ 16న మరణించారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో

# సిఎం, డిప్యూటీ ఫోటోలు

### చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఫోటోలు ఉండాల్సిందే

### అధికారులను ఆదేశించిన సిఎం చంద్రబాబు



అమరావతి,జూన్15 (ప్రజా మంటలు):
ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి ఫోటోలను ఏర్పాటు చేస్తుంటారు. కానీ రాష్ట్రంలో ఇకపై సీఎం చంద్రబాబు నాయుడుతోపాటు ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యామ్ చిత్రపటాలను కూడా ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇరువురు ఫోటోలను ఏర్పాటు చేయాల్సిందిగా సీఎం చంద్రబాబు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఐ అండ్ పిఆర్ అధికారులకు సూచనలు చేశారు. తాజా నిర్ణయంతో ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫోటోలు ఉండనున్నాయి.సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో కూటమి విజయం సాధించిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించగా, ముఖ్యమంత్రిగా పవన్ కు బాధ్యతలను చంద్రబాబు అప్పగించారు. రాష్ట్రంలో వైసిపి ఓటమి సాధించడంలో, టిడిపి, జనసేన, బిజెపి నేతృత్వంలో కూటమి ఏర్పాటు కావడంలో పవన్ క్రియాశీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అందులో భాగంగానే ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు కీలక శాఖలను పవన్ కు అప్పగించారు.పవన్ కళ్యాణ్ కు ఇచ్చిన పదవికి గౌరవాన్ని కల్పించే ఉద్దేశంతో మరొకరికి ఉప ముఖ్యమంత్రి పదవిని చంద్రబాబు ఇవ్వలేదు. తనతో పాటు సమానంగా పవన్ కు గౌరవాన్ని ఇవ్వాలని భావించిన చంద్రబాబు నాయుడు.. ఈ మేరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పవన్ ఫోటో కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# అటవీ దొంగలు ఎంతటి వారైనా ఉపేక్షించం

**అడవులను, పర్యావరణాన్ని కాపాడుతాం**

**ఎర్రచందనం దొంగలను అరికడతాం**

**ఎంతటి వారైనా కటకటాల్లోకి తోసేస్తాం**

**ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి**

**మీడియాతో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**



అమరావతి,జూన్15 (ప్రజా మంటలు):
ఎర్రచందనం, అటవీ సంపద అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతామని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్-గ్రామీణాభివృద్ధి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. అడవుల వినాశనానికి పాల్పడినా, ప్రయత్నించినా ఎంతటి వారైనా సరే కటకటాల వెనక్కు వెళ్లాల్సిందేనని మాస్ వార్నింగ్ ఇచ్చారు. రాష్ట్ర ప్రజలకు మేలైన సేవలు అందించే భాగ్యం కలిగిందని అన్నారు. ప్రజల సమస్యలు స్వయంగా చూశానని, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, తాగు నీరు అందించడంపై ప్రత్యేక దృష్టి పెడతానని అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా తాను నిర్వర్తించబోయే శాఖలు తన మనసుకు, జనసేన మూల సిద్దాంతాలకు చాలా దగ్గరగా ఉన్నాయని తెలిపారు. శాఖలన్నీ ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేవి, ప్రభుత్వాన్ని ప్రజల దగ్గరకు చేర్చేవిగా తాను భావిస్తున్నానని అన్నారు. శనివారం సచివాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... 2014 నుంచి తాను రాష్ట్ర వ్యాప్తంగా చేసిన పర్యటనల సందర్భంగా అనేక కష్టాలు కన్నీళ్లు చూశానని చెప్పారు. ఆడపడుచులు గుక్కెడు నీళ్ల కోసం పడుతున్న అవస్థలు తనకు ఆవేదన కలిగించాయన్నారు. ఉపాధి హామీ నిధులను సద్వినియోగం చేసుకోవడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా పల్లెలకు రక్షిత తాగునీరు అందించి ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పర్యావరణాన్ని పరిరక్షించే అభివృద్ధి ప్రస్థానం' అనేది జనసేన మూల సిద్దాంతాల్లో ఒకటి అని చెప్పారు. పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరగాలని.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా అందాలని కోరుకున్నారు. ఆధునిక సాంకేతికత మేళవించిన సురక్షితమైన పారిశ్రామిక అభివృద్ధి ఈ సమాజానికి అవసరమని చెప్పుకొచ్చారు. విశాఖ ఎల్జీ పాలిమర్స్ ప్రమాదాన్ని మనం ఏనాడూ మరచిపోలేమని అన్నారు. ప్రజల ఆరోగ్యాలను హరించివేయకుండా పరిశ్రమలు ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకునేలా పరిశ్రమలు ముందుకు వెళ్లడానికి చేయూతని స్తామన్నారు. భూతాపాన్ని తగ్గించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న ప్రయత్నాలకు బాసటగా నిలుస్తామని వివరించారు. గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకునేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తామని చెప్పారు. వృక్షో రక్షతి రక్షితః అనే సూక్తి తన మదిలో ఎప్పుడూ మార్మోగు తుంటుందన్నారు. అడవుల విధ్వంసమే కరువు కాటకాలకు హేతువు. అలాంటి అడవులను కంటికి రెప్పలా కాపాడతామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మంత్రివర్గంలో తనకు కేటాయించిన శాఖలు జనసేన మూల సిద్దాంతాలకు, తన మనసుకు దగ్గరగా ఉన్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. కీలక శాఖలు కేటాయించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా రాష్ట్ర ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కిందని తెలిపారు. తనకు కేటాయించిన శాఖలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఉపాధి హామీ నిధుల సద్వినియోగం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పవన్ వెల్లడించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా గ్రామాలకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకునేలా పరిశ్రమలను ప్రోత్సహిస్తానని పేర్కొన్నారు. అటవీ సంపదను కాపాడి, పచ్చదనాన్ని పెంచుతామని చెప్పారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. తీర ప్రాంతాల్లో మడ అడవుల సంరక్షణకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్‌కు ప్రజా ప్రయోజన శాఖల బాధ్యతలు అప్పగించడం పట్ల పవన్ సంతృప్తి వ్యక్తం చేశారు. పర్యాటక ప్రాజెక్టుల ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు కృషి చేస్తామన్నారు. సినీ రంగానికి రాష్ట్రంలో స్నేహపూరిత వాతావరణం నెలకొల్పుతామని వివరించారు. సినీ పరిశ్రమకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించడంతోపాటు ఆ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు దక్కేలా చూస్తానని పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.


# ప్రజలకు తనకు మధ్య అడ్డుగోడలు ఉండరాదు

**ప్రజల నుంచి వినతుల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాటు**

**పోలవరం నుంచే ప్రజాక్షేత్రంలోకి వెళతా**

**విధ్వంసానికి సాక్షిగా ప్రజావేదిక శిథిలాల**

**పార్టీ కార్యాలయంలో మీడియాతో సిఎం చంద్రబాబు**



అమరావతి,జూన్15 (ప్రజా మంటలు):
తనకు, ప్రజలకు మధ్య ఎలాంటి అడ్డుగోడలు ఉండటానికి వీల్లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వారి సమస్యల వినతుల స్వీకరణకు ప్రత్యేక ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని ఏ పద్ధతుల్లో ఏర్పాటు చేయాలో అభిప్రాయాలు తీసుకుని ఉత్తమ విధానం అమలు చేస్తామని అన్నారు. శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి చంద్రబాబు వచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్ చేశారు. ఏపీ సచివాలయంలోనే వినతులు స్వీకరిస్తే ఎలా ఉంటుందనే విషయంపై ఆలోచిస్తున్నా మని తెలిపారు. ప్రజావినతులు స్వీకరణకు వీలైనంత ఎక్కువ సమయం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. వాటి పరిష్కారానికి నిర్దిష్ట సమయం ఉండేలా చర్యలు తీసుకుంటానని మాటిచ్చారు. సచివాలయానికి రాకపోకల కోసం రవాణా, ఇతరత్రా వెసులుబాటులన్నీ అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. ప్రజావేదిక ఉండి ఉంటే వినతుల స్వీకరణకు అనువుగా ఉండేది, కానీ జగన్ ప్రజా వేదికను కూల్చి వేశారని గుర్తుచేశారు. ప్రజావేదికను విధ్వంస పాలనకు ప్రతీకగా అలానే ఉంటుందని ఉద్ఘాటించారు. ఆ శిథిలాలను తొలగించమని అన్నారు. త్వరలోనే క్షేత్ర స్థాయి పర్యటనలు ప్రారంభిస్తామని వివరించారు. పోలవరంతోనే తన క్షేత్రస్థాయి పర్యటనలు ప్రారంభమవుతాయని చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు ఎప్పటి నుంచీ నిర్వహించేది త్వరలోనే నిర్ణయిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఎరువుల, విత్తనాల కొరత రావద్దు

### అధికారులకు మంత్రి అచ్చన్న సూచన



అమరావతి,జూన్15 (ప్రజా మంటలు):
ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చీ రాగానే పాలనపై దృష్టి సారించింది. అస్తవ్యస్తంగా ఉన్న ఏపీని గాడిన పెట్టేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా ఏపీలో మంత్రులకు శాఖలు కేటాయించడంతో వారంతా పనిలో నిమగ్నమయ్యారు. తమ శాఖలకు సంబంధించిన అధికారులతో సమావేశాలు నిర్వహిస్తు?న్నారు. ఈ క్రమంలో వ్యవసాయశాఖ, పశుసంవర్ధక శాఖ ముఖ్య అధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది సైతం పాల్గొన్నారు. ఖరీఫ్ సీజన్ సమీపించిన తరుణంలో రైతులకు విత్తనాలు, ఎరువులు కొరత రాకుండా చూడాలంటూ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. పంటలకు నాణ్యమైన పురుగులు మందులు అందేలా చూడాలని ఆదేశించారు.ఈ నెల 18 న రైతన్నలకు అందించబోయే పీఎం కిసాన్ యోజన తదితర అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులతో అచ్చెన్నాయుడు చర్చించారు. ప్రతీ అధికారి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

# నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే

**నిర్లక్ష్యంతో ఫుడ్ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు - రాష్ట్ర వ్యాప్తంగా బృందాలు నిరంతరం ఆహార తనిఖీ - మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా ఆహార పదార్థాల టెస్టులు- తయారుదారులు లైసెన్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి- ఫుడ్ సేఫ్టీలో తెలంగాణ ఆదర్శంగా నిలవాలి- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ - ఫుడ్ సేఫ్టీపై ఉన్నత స్థాయి సమీక్ష**

హైదరాబాద్, జూన్15 (ప్రజా మంటలు):
ఫుడ్ సేఫ్టీపై ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ పై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో దామోదర్ రాజనర్సింహ అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్లక్ష్యంతో ఫుడ్ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆహార తనిఖీ బృందాలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఫుడ్ లాబ్స్ ద్వారా సుమారు 180 నుంచి 200 ఫుడ్ శాంపిల్స్ లను టెస్టులు చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రభుత్వ హాస్టల్స్, ప్రైవేటు బోర్డింగ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లు, బేకరీలు, డెయిరీ ఫుడ్ తయారీదారులు, రెస్టారెంట్లు, ప్యాకేజ్డ్ ఫుడ్ తయారుదారులు లైసెన్స్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఉపేక్షించేది లేదని మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ యాక్ట్ %-% 2006 ప్రకారం నాణ్యత ప్రమాణాలు పాటించని ఫుడ్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. టాస్క్ ఫోర్స్ , ఫుడ్ సేఫ్టీ అన్ వీల్స్ (ఫుడ్ లాబ్స్), ఆకస్మిక తనిఖీలు, అవగాహన సదస్సులను నిరంతరం నిర్వహించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఫుడ్ సేఫ్టీ అధికారుల పనితీరు పై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.కాగా.. మనం తీసుకునే ఆహారం నాణ్యత లోపం ఉంటే అనారోగ్య సమస్యలు మన దరికి చేరుతాయి. ఇటీవల కాలంలో ఎక్కువగా భోజనప్రియులు బయటి హోటల్, రెస్టారెంట్లలో భుజించేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నటువంటి పరిస్థితి. అయితే భోజనం ప్రియుల ఆదరణకు నోచుకుంటున్న పలు హోటల్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ శభాష్ అనిపించుకుంటూ ఉండగా, మరికొన్ని హోటల్, రెస్టారెంట్ల యాజమాన్యాలు మాత్రం ఫ్రిజ్ లలో ఆహార పదార్థాలను నిల్వ ఉంచుతూ భోజన ప్రియులకు అందిస్తున్న తీరును అరికట్టేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు.

# సివిల్స్ అభ్యర్థులకు ప్రత్యేక మెట్రో సేవలు

### ఢిల్లీ మెట్రో కీలక నిర్ణయం

న్యూఢిల్లీ,జూన్15 (ప్రజా మంటలు):
సివిల్ ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఢిల్లీ మెట్రో గుడ్‌న్యూస్ చెప్పింది. ఫేజ్-%×××% విభాగాల్లో ఢిల్లీ మెట్రో సేవలు జూన్ 16న ఉదయం 6 గంటల నుంచి అందుబాటులోకి రానుందని వెల్లడించింది. త్వరలో జరగనున్న యూపీఎస్సీ పరీక్షను దృష్టిలో ఉంచుకుని ఆదివారం ఉదయం 6 గంటల నుంచి ఫేజ్-3 విభాగాల్లో రైలు సేవలు అందుబాటులో ఉంటాయని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ ప్రకటించింది.సాధారణంగా ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఫేజ్-3 సెక్షన్లలో మెట్రో రైలు సేవలు జూన్ 16 ఉదయం 6 గంటలకు ప్రారంభమవుతాయని డీఎంఆర్‌సీ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనూజ్ దయాల్ శుక్రవారం తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ యూపీఎస్‌సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్) పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను సులభతరం చేయడానికి ఈ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఫేజ్-%×××% విభాగాల్లో దిల్షాద్ గార్డెన్-షహీద్ స్థల్, నోయిడా సిటీ సెంటర్-నోయిడా ఎలక్ట్రానిక్ సిటీ, ముండ్కా-బ్రిగేడియర్ హోషియార్ సింగ్, బదర్‌పూర్ బోర్డర్-రాజా నహర్ సింగ్ (బల్లభఘర్), మజ్లిస్ పార్క్-శివ్ విహార్, జనక్‌పురి వెస్ట్-బొటానికల్ గార్డెన్ మధ్య రైళ్లు నడవనున్నాయి. మిగిలిన సెక్షన్లలో మెట్రో సేవలు ఉదయం 6 గంటల నుంచి సాధారణ షెడ్యూల్ ప్రకారం నడుస్తాయని తెలిపారు. యూపీఎస్‌సీ పరీక్షల నేపథ్యంలో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నమో భారత్ రైలు సేవలు అందుబాటులో ఉంటాయని నేషనల్ క్యాపిటల్ రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కూడా గురువారం తెలిపింది. రీజినల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ కారిడార్ చుట్టూ ఉన్న కేంద్రాలలో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను సులభతరం చేయడానికి ఎన్‌సీఆర్‌టీసీ ఉదయం 8 గంటలకు బదులుగా ఉదయం 6 గంటల నుంచి సేవలను ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం నమో భారత్ రైళ్లు సాహిబాబాద్ నుంచి ఘజియాబాద్‌లోని మోడీ నగర్ నార్త్ వరకు కారిడార్‌లో నడుస్తున్నాయి. నమో భారత్ ఆపరేటింగ్ విభాగం చుట్టూ వివిధ విద్యా సంస్థలు ఉన్నాయి, ఇక్కడ వివిధ పోటీ పరీక్షలు తరచుగా జరుగుతుంటాయి.

# విమానాల్లో దొంగతనాలు అతడి స్పెషల్

**ఒంటరి మహిళలు లక్ష్యంగా ఆభరణాల చోరీ**

**ఎట్టకేలకు శంషాబాద్ పోలీసులకు చిక్కిన గజదొంగ**

హైదరాబాద్,జూన్15 (ప్రజా మంటలు):
సాధారణంగా దొంగలు.. ఎవరూ లేని ఇళ్లను టా÷-గ్గ్÷ట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతుంటారు. ఇళ్లల్లోకి చొరబడి.. నగదు, బంగారం వంటి విలువైన వస్తువులు ఎత్తుకెళ్తారు. కానీ, ఓ దొంగ మాత్రం వినూత్నంగా ఆలోచించాడు. దొంగతనాలు చేసేందుకు విమానాలనే అడ్డగా మార్చుకున్నాడు. విమానాల్లో ప్రయాణిస్తూ దొంగతనాలు చేయడం మొదలెట్టాడు. ఒంటరి మహిళలే టార్గెట్ చేస్తూ.. చాలా ఈజీగా బంగారు ఆభరణాలు కొట్టేస్తున్నాడు. సరదాగా సాగిపోతున్న తన దొంగతనాలకు ఎట్టకేలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ పోలీసులు చెక్ పెట్టారు. విమానాల్లో తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగను ఆర్ జీఐ ఎయిర్ పోర్ట్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు..అతరి దగ్గర నుంచి సుమారు ఒక కిలో బంగారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా డీసీపీ నారాయణరెడ్డి మాట్లాడుతూ... ఢిల్లీకి చెందిన రాజేష్ సింగ్ కపూర్ అనే వ్యక్తి జల్సాలకు అలవాటు పడి.. దొంగతనాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. 110 రోజుల్లో ఏకంగా 200 సార్లు విమానాల్లో తిరుగుతూ.. దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. కనెక్టివిటీ విమానాల్లో ప్రయాణించి ఒంటరి మహిళలే లక్ష్యంగా ఈ దొంగతలకు పాల్పడుతున్నాడని చెప్పారు. విమానంలోని క్యాబిన్ లో భద్రపరిచిన ఒంటరి మహిళల బ్యాగుల పక్కనే నిందితుడు తన బ్యాగును పెట్టి.. వారు వాష్ రూమ్ కు వెళ్లిన వెంటనే అక్కడికి వెళ్లి సదరు మహిళల బ్యాగులో ఉండే విలువైన బంగారు ఆభరణాలను అతని బ్యాగులో పెట్టుకోవడం జరుగుతుందని చెప్పారు. తర్వాత విమానం దిగి బంగారు ఆభరణాలను పాన్ బ్రోకర్లకు అమ్మి డబ్బులు సంపాదిస్తున్నాడని తెలిపారు.ఆర్ జీ పోలీస్ స్టేషన్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో నిందితుడిపై పది కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. అతనికి సహకరిస్తున్న మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. విమానాల్లో ప్రయాణించే మహిళలు తమ వెంట తీసుకువెళ్లే బ్యాగులను జాగ్రత్తగా పెట్టుకోవాలని ప్రయాణికులకు సూచించారు.

# బడ్జెట్ పద్దులపైనే అందరి దృష్టి

## సంకీర్ణంలో కేటాయింపులపై సర్వత్రా చర్చ

## నిర్మలమ్మ ఏకపక్ష నిర్ణయాలకు కాలం చెల్లినట్లే

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):



వరుసగా మూడోసారి కొలువుదీరిన మోదీ సర్కార్, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై కసరత్తు ప్రారంభించింది. త్వరలో ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కాకుండా.. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ కసరత్తులో భాగంగా నార్త్‌బ్లాక్‌లోని ఆర్థిక శాఖ కార్యాలయంలో సందర్శకుల ప్రవేశంపై ఆంక్షలు ప్రారంభమయ్యాయి. సాధారణంగా ప్రతి ఏటా బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెడుతారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన 'ఓటాన్ అకౌంట్' బ్జడెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి వచ్చింది. ఇది ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే వరకు మాత్రమే అమల్లో ఉంటుంది. ఎన్నికల తర్వాత వచ్చే ప్రభుత్వానికే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అధికారం ఉంటుంది. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ గెలుపొంది సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే 2014, 2019 మాదిరిగా బీజేపీకి సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ రాలేదు. గత రెండు పర్యాయాలు తాము కోరుకున్న రీతిలో బడ్జెట్‌ప్రవేశపెడుతూ వచ్చిన మోదీ సర్కారు, త్వరలో ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్‌పై గుత్తాధిపత్యం కొనసాగిస్తుందా లేక మిత్రపక్షాల డిమాండ్లకు చోటిస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. కొత్త ప్రభుత్వంలోనూ కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మల సీతారామన్‌ను కొనసాగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థికశాఖ మంత్రిగా ఆమె ఇప్పటికే 6 పర్యాయాలు బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ రూపకల్పన సందర్భంగా వివిధ వర్గాలతో సమావేశాలు నిర్వహించడం, వారి ఆకాంక్షలను తెలుసుకుని తదనుగుణంగా బడ్జెట్ తయారుచేయడం ఆనవాయితీ. ఆ ప్రకారం రైతు సంఘాల నుంచి వ్యాపారవర్గాల వరకు అందరినీ కలుస్తుంటారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ మళ్లీ మొదలైంది. అయితే బడ్జెట్‌పై కోటి ఆశలతో ఎదురుచూసేది మాత్రం వేతన జీవులే. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి సంపాదించిన సొమ్ములో ఆదాయపు పన్ను రూపేణా కేంద్ర ప్రభుత్వం ముక్కుపిండి వసూలు చేయడంతో పాటు పరోక్షంగా అనేక రూపాల్లో పన్నుల దాడికి గురవుతుంటారు. వందలు, వేల కోట్లు ఆర్జించే వ్యాపార, పారిశ్రామిక వర్గాల్లో చాలా వరకు తప్పుడు లెక్కలు చూపించి పన్ను ఎగవేస్తుంటారు. ఈ పరిస్థితుల్లో సామాన్య వేతన జీవులు ప్రభుత్వం తమపై మోపుతున్న పన్ను భారాన్ని తగ్గిస్తుందా అని ఆశగా ఎదురుచూస్తుంటారు. ఇప్పటికే 6 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మల సీతారామన్‌పై వేతన జీవులకు సదభిప్రాయం లేదు. ఈసారైనా తమపై కరుణచూపి పన్ను శ్లాబుల్లో మార్పుల రూపంలోనో.. లేక పన్ను మినహాయింపుల రూపంలోనో ఊరట కల్గిస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదే మాదిరిగా వ్యవసాయ, వ్యాపార, తయారీ రంగాలవారు కూడా ఈ బ్జడెట్ ద్వారా తమకు లభించే ప్రోత్సాహకాలు, పన్ను రాయితీల గురించి ఎదురు చూస్తుంటారు. దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే ప్రభుత్వం వద్ద దండిగా నిధులుండాలి. ప్రభుత్వ గడించే ఆదాయంలో పన్నులు, సుంకాల రూపంలోనే ఎక్కువగా ఉంటుంది. పన్ను రేట్లు తగ్గిస్తే ఆదాయం తగ్గుతుంది. ఆదాయం తగ్గితే అభివృద్ధి తగ్గుతుంది. కాబట్టి ఇదొక అంతులేని కథలా కొనసాగుతుంది. మరోవైపు లోక్‌సభతో పాటు రాజ్యసభ 264వ సెషన్ జూన్ 27 నుంచి ప్రారంభమవుతుంది. అంటే లోక్‌సభ తొలి రెండు రోజులు సభ్యుల ప్రమాణ స్వీకారం, మూడో రోజు స్పీకర్ ఎన్నిక పూర్తిచేసిన తర్వాత రాజ్యసభ మొదలవుతుంది. అదే రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ఉంటుందని పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి. ప్రతియేటా బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగించారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే రాష్ట్రపతి ప్రసంగం ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రసంగం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఏం చేయదల్చుకుందో చెప్పే ప్రయత్నం చేస్తుంది.





# తెలుగు ఐఏఎస్ కృష్ణతేజకు జాతీయ పురస్కారం

## అభినందించిన డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

అమరావతి,జూన్15 (ప్రజా మంటలు):
తెలుగు ఐఏఎస్ కృష్ణతేజకు ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు. జాతీయ బాలల రక్షణ కమిషన్ పురస్కారానికి ఆయన ఎంపిక కావడం హర్షణీయమని తెలిపారు. మరిన్ని సేవలందిస్తూ ఉద్యోగులు, యువతకు స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కృష్ణతేజ త్రిస్సూర్ కలెక్టర్‌గా పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ఆయన ఉత్తమ విధానాలు అనుసరించారని గుర్తుచేశారు. కరోనా, కేరళ వరదల విపత్తుల సమయంలో ఆయన అందించిన సేవలను ప్రజలు మరచిపోలేదని పవన్ తెలిపారు. తెలుగుతేజం, ఐఏఎస్ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణతేజకు జాతీయ పురస్కారం లభించింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన ఆయన కేరళ రాష్ట్రం త్రిసూర్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్నారు. బాలల హక్కుల రక్షణలో దేశంలోనే త్రిసూర్ జిల్లాను అగ్రగామిగా నిలపడంతో జాతీయ బాలల హక్కుల కమిషన్ పురస్కారానికి ఎంపికయ్యారు. 27న దిల్లీలో ఈ అవార్డును అందుకోనున్నారు. 2015 బ్యాచ్ ఐఏఎస్ అయిన కృష్ణతేజ 2023 మార్చిలో కేరళ రాష్ట్రం త్రిసూర్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కరోనా కారణంగా తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన 609 మంది విద్యార్థులను గుర్తించి దాతల సహకారంతో వారు ఉన్నత చదువులు చదివేలా చూశారు. అలాగే కరోనా సమయంలో భర్తలను పోగొట్టుకున్న 35 మంది వితంతువులకు ఇళ్లు నిర్మింపజేశారు. మరో 150 మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించారు.

# స్పందనకు సరికొత్త రూపం

## ప్రజా ఫిర్యాదులు పరిష్కార వేదికగా మార్పు

## ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత

## మంగళగిరి ప్రజల కోసం లోకేశ్ ప్రత్యేక ఏర్పాట్లు

అమరావతి,జూన్15 (ప్రజా మంటలు):
ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటైన తెదేపా ప్రభుత్వం వ్యవస్థల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గతంలో స్పందన పేరిట చేపట్టిన వ్యవస్థలో పూర్తిస్థాయి మార్పులు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 'స్పందన' పేరును తొలగించి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థగా కొనసాగించాలని ఉత్తర్వులను జారీ చేసింది. ఇక నుంచి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టమ్ పేరుతో ఫిర్యాదుల స్వీకరణ చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రజలకు మరింత అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయించింది. కలెక్టరేట్లలో ప్రతి సోమవారం కలెక్టర్లు, అధికారులు ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ తక్షణమే అమలుకు సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలావుంటే మంగళగిరి ప్రజల కోసం 'ప్రజా దర్బార్' నిర్వహించినట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా చాలా సేవా కార్యక్రమాలు చేశామన్నారు. భారీ మెజార్టీతో గెలిచిన తనపై బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో అందుబాటులో ఉన్న రోజుల్లో ప్రజలను కలుస్తామని చెప్పారు. ఉదయం 8 గంటలకు ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటామన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసినట్లు వివరించారు. నారా లోకేశ్ మంగళగిరి ప్రజల కోసం ఉండవల్లిలోని నివాసంలో ఉదయం 8 గంటల నుంచి 'ప్రజా దర్బార్' నిర్వహించారు. దీంతో సమస్యలు విన్నవించేందుకు నియోజకవర్గ ప్రజలు తరలివచ్చారు. వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామని లోకేశ్ వారికి హామీ ఇచ్చారు. ఆయా విభాగాల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇకపోతే పార్టీ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు ఇకపై తరచూ పార్టీ కార్యలయానికి వెళ్లేలా చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేశారు. పార్టీ కార్యాలయంలో మంత్రులు కూడా అందుబాటులో ఉండేలా కార్యాచరణ చేశారు. పార్టీ – ప్రభుత్వం మధ్య సమన్వయానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయనున్నారు.

# కెసిఆర్ రాజకీయంగా దెబ్బతిన్నట్లే

## కాలు ముందుకు పెట్టేలని దుస్థితి

హైదరాబాద్, (ప్రజా మంటలు):
కేసీఆర్ నైతికంగా బలహీనపడి పోయారు. కూతరు కవిత లిక్కర్ స్కామ్, ధరణి వ్యవహారం, ఫోన్‌ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్ ఒపపందాల విచారణ వంటివి ఇప్పుడు మెడకు చుట్టుకుంటు న్నాయి. రాష్ట్రంలో ఆయన బలమైన నాయకుడే అయినా, ఆ బలం జాతీయ స్థాయిలో నాయకుడిగా ఎదగడానికి ఉపయోగ పడలేదు. నితీశ్ కుమార్, అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ లాంటి వారు ఉత్తరాదికి చెందిన వారు కావడంతో వారికి వచ్చిన గుర్తింపు కెసిఆర్ కు రావడం లేదు. కెసిఆర్ స్వయంకృతం కూడా ఇందుకు కారణం. అవినీతి వ్యవహారాలను నడిపిన కారణంగా ఓటమి చెందడంతో ఇప్పుడు ఆయనపై ఉన్న భ్రమలు తొలగిపోయాయి. కేసులు చుట్టుముడుతున్నాయి. ఇవన్నీ తూచ్ అని తీసి పారేయడానికి లేదు. నైతిక పతనమే ఇందుకు కారణం. తెలంగాణలో తానేం చేసినా చెల్లుబాట వుతుందని నమ్మడం వల్లనే ఆయన ఎప్పట కప్పుడు నాలుక మడతేసారు. ప్రాంతీయ పార్టీల నాయకులు ఒకప్పుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం పాకులాడేవారు. ఇప్పుడు స్వప్రయోజనాల కోసం దేబిరించే పరిస్థితికి చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ముందు మోకరిల్లితే చాలు స్వరాష్ట్రాలలో ఎన్ని తప్పులైనా చేయవచ్చు, ఎంత నిరంకుశంగానైనా పాలించవచ్చు అన్న ధోరణి ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రబలుతోంది. కేసీఆర్ ఇందుకు మినహాయింపు అని నిన్నటివరకు అమాయకంగా నమ్మినవాళ్లు ఇప్పుడు ఆశ్చర్యపోతున్నారు. ఉద్యమ పార్టీలు నైతికంగా పతనం కావడం కొత్త కాదు. బిహార్ నుంచి ఝార్ఖండ్ రాష్ట్రం విడివడటానికి కారణమైన ఝార్ఖండ్ ముక్తి మోర్చా గురించి తెలిసిందే. ఇప్పుడు బీఆర్ఎస్ వంతు వచ్చింది. ఇక మీదట జాతీయ రాజకీయాలలో అది చేద్దాం, ఇది చేద్దాం అని కేసీఆర్ అన్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవచ్చు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో ప్రతిపక్షాల ఐక్యత అని పర్యటించిన కేసీఆర్, ఇకపై కాలు బయట పెట్టకపోవచ్చు. ఎవరెవరినో రప్పించుకుని బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు ప్రకటనలు చేసినా అదంతా ఉత్తిదే అని ఎన్నికల్లో ప్రజలు తీర్పును ఇచ్చారు. మొత్తంమీద కేసీఆర్ రాజకీయాల్లో రాటుదేలడం కాదుకదా, తట్టుడు రాయికే పడిపోయాడు.



## డిప్యూటీ సీఎంభట్టికి సిఎం రేవంత్ బర్త్‌డే శుభాకాంక్షలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. భగవంతుడు మీకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో నిమగ్నమై రాష్ట్రాభివృద్ధికి మరింత కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అటు ప్రజా భవన్ లో భట్టి విక్రమార్క పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యుల సమక్షంలో 50 కిలోల కేకును డిప్యూటీ సీఎం కట్ చేశారు. పార్టీ శ్రేణులు అభిమానుల రాకతో ప్రజాభవన్ పరిసర ప్రాంతాలు కిక్కిరిసి పోయాయి. అంతకుముందు ప్రజా భవన్ లోని పోచమ్మ దేవాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి భట్టి విక్రమార్క పూజలు చేశారు. పలువురు మంత్రులు, అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


## జగిత్యాల డిఎంహెచ్ ఓ శ్రీధర్ ను వెంటనే అరెస్ట్ చేయాలి


### కొప్పుల రాజ్ కుమార్ చావుకు డిఎంహెచ్ ఓ నే బాధ్యుడు

### జిల్లా అదనపు కలెక్టర్, అడిషనల్ ఎస్పీ లకు పిర్యాదు

### సెలవులో వెళ్ళిన డిఎంహెచ్ ఓ

జగిత్యాల జూన్ 15 ( ప్రజా మంటలు )
జగిత్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పుప్పాల శ్రీధర్ ను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, అడిషనల్ ఎస్పీ ఎస్.వినోద్ కుమార్ లకు మృతుడు కొప్పుల రాజ్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి పిర్యాదు చేశారు.
ఈ సందర్భంగా దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్సివ్ పోర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సావెల గంగాధర్, జిల్లా అధ్యక్షులు కాయితి శంకర్ తదితరులు మాట్లాడుతూ....జగిత్యాల జిల్లా కేంద్రంలోని 104 లో డ్రైవర్ గా పని చేసే కొప్పుల రాజ్ కుమార్ (56) అనే వ్యక్తి ఇటీవల మృతి చెందడానికి డిఎంహెచ్ ఓ పుప్పాల శ్రీధర్ తలపెట్టిన పని ఒత్తిడే కారణం అని వారు ఆరోపించారు. ఎలాంటి విరామం లేకుండా పని చెపుతూ తీవ్ర ఒత్తిడికి గురి చేయడం వల్లనే కొప్పుల రాజ్ కుమార్ గుండెపోటుతో మృతి చెందారని వారు వివరించారు. జగిత్యాల పట్టణ పోలీసులు డిఎంహెచ్ ఓ శ్రీధర్ పై పలు సెక్షన్ లతో పాటు ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి కూడా అరెస్ట్ చేయకపోవడం పట్ల వారు తీవ్రంగా మండి పడ్డారు. అంతే కాకుండా హేండిసి పెటేడ్ బెయిల్ కొరకు ప్రయత్నం చేస్తున్నారని పోలీసులు చెప్పడం సిగ్గు చేటన్నారు. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అధికారిక సమావేశాలలో పాల్గొన్న పుప్పాల శ్రీధర్ ను





పరారీలో ఉన్నాడని పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.
పోలీసులు ముద్దాయికి పూర్తి స్థాయిలో సహకరిస్తున్నారని ఆరోపించారు. వెంటనే డిఎం హెచ్ ఓ ను అరెస్ట్ చేసి రిమాండ్ చేయాలన్నారు.
మృతుడి కుటుంబంలో ఒకరికి శాశ్వత ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తూ... రూ.50 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. దళిత లిబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, నేషనల్ అట్రాసిటీస్ ప్రివెన్సివ్ పోర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సావెల గంగాధర్, జిల్లా అధ్యక్షులు కాయితి శంకర్ తదితరులు పాల్గొన్నారు.
సెలవులో వెళ్ళిన డిఎం హెచ్ వో
జగిత్యాల డిఎం హెచ్ వో పుప్పాల శ్రీధర్ ఈ నెల 15 నుండి 30 తేది వరకు అనారోగ్య కారణాల వలన సెలవులో వెళ్లినట్లు వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో డా.శమియోద్దీన్ ను నియమిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# జగన్ లోటస్‌పాండ్ ఇంటిముందు ఆక్రమణలు

## రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు కూల్చివేత

హైదరాబాద్, (ప్రజా మంటలు):
వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి రేవంత్ సర్కార్ ఊహించని ఝలక్ ఇచ్చింది. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో జగన్ ఇంటి ముందు ఉన్న అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ కొరడా ఝులిపించింది. జగన్ ఇంటిముందు ఉన్న అక్రమ నిర్మాణాలను ఒక్కొక్కటిగా అధికారులు కూల్చివే స్తున్నారు. గతంలో జగన్ భద్రత కోసం రోడ్డును ఆక్రమించి మరీ గదులను సిబ్బంది నిర్మించడం జరిగింది. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగిస్తున్నారు. నివాసం ముందున్న అక్రమ నిర్మాణాలను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. లోటస్ పాండ్ వద్ద అక్రమంగా నిర్మించిన పోలీస్ సెక్యూరిటీ షెడ్లను జీహెచ్ఎంసీ తొలగించింది. రహదారికి అడ్డుగా ఉన్నాయన్న ఫిర్యాదుతో జీహెచ్ఎంసీ అధికారులు మూడు షెడ్లను కూల్చేశారు. అక్రమ నిర్మాణాలు తొలగించాలని లోటస్ పాండ్ సిబ్బందికి జీహెచ్ఎంసీ, పోలీసులు నిన్ననే ఆదేశాలు జారీ చేశారు. రహదారి పక్కనే అక్రమ నిర్మాణాలతో రాకపోకలకు ఇబ్బంది మారిందని ఫిర్యాదు అందడంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ అధికారులకు సామాన్య ప్రజలు, వాహనదారులు ఫిర్యాదులు చేశారు. ఈ వరుస ఫిర్యాదులో రంగంలోకి దిగిన అధికారులు కూల్చివేతలు ప్రారంభించారు. కాగా.. పోలీస్ బందోబస్తు మధ్య జగన్ ఇంటి ముందు నిర్మాణాలను అధికారులు కూల్చివేసారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com